1st Happy Work Anniversary. Year

షణ్ముఖ SHANMUKHAVELUGU
# వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు తెలుగు దినపత్రిక

RNI : APTEL / 2023 / 89152

Good for Health
Best for Readers
THE POWER OF RK PEN

సంపుటి : 2 సంచిక : 292 ఎడిటర్ & పబ్లిషర్ : ఓబులశెట్టి రాధాకృష్ణ దాస్ గురువారం 16 అక్టోబర్ 2025 పేజీలు 8 : వెల 3/-ఒంగోలు

VOLUME : 02 ISSUE : 292 EDITOR & PUBLISHER : OBULASETTY RADHAKRISHNA DASS PUBLISHED : ONGOLE Thursday 16 October 2025 PAGES : 8 PRICE : 3/-

# పథకాల అమలు తీరు తెలుసుకునేందుకు నవంబర్ నుంచి క్షేత్రస్థాయిలో పర్యటిస్తా



ప్రజలు మెచ్చేలా సుపరిపాలన అందిస్తున్నామన్న చంద్రబాబు
పాలనలో సుస్థిర విధానాలను అమలు చేస్తామని వెల్లడి
ఆర్టీజీఎస్, ప్రభుత్వ సేవల్లో సంతృప్త స్థాయిపై సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు

**(షణ్ముఖ వెలుగు, అమరావతి,అక్టోబర్ 15)**

ప్రభుత్వం అమలు చేస్తోన్న పథకాలు, కార్యక్రమాల అమలు తీరును తెలుసుకునేందుకు నవంబరు నెల నుంచి క్షేత్రస్థాయిలో పర్యటిస్తానని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. ప్రతీ పౌరుడికీ సంక్షేమ ఫలాలు ఎలా అందుతున్నాయో పరిశీలిస్తానని సీఎం అన్నారు. బుధవారం సచివాలయంలోని ఆర్టీజీఎస్ కేంద్రంలో ప్రభుత్వ సేవల్లో సంతృప్త స్థాయి సహా రియల్ టైమ్ గవర్నెన్స్ పనితీరుపై ముఖ్యమంత్రి అధికారులతో సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో ప్రజలు మెచ్చేలా సుపరిపాలన అందిస్తున్నామని, పాలనలో సుస్థిర విధానాలను అమలు చేస్తామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. గతనెల 22వ తేదీ నుంచి నిర్వహిస్తున్న సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్ కార్యక్రమంలో భాగంగా జీఎస్టీ 2.0 సంస్కరణలతో -మిగతా 2లో

## గూగుల్‌తో ఏపీ ప్రభుత్వం ఒప్పందం.. ఆంధ్రప్రదేశ్‌లో నవశకం: మంత్రి పార్థసారథి



**(షణ్ముఖ వెలుగు, అమరావతి,అక్టోబర్ 15)**

గూగుల్‌తో ఏపీ ప్రభుత్వం ఒప్పందం చరిత్రాత్మకమని మంత్రి పార్థసారథి అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో నవశకం ఆరంభమైందని చెప్పారు. ఏపీలో డేటా సెంటర్ రావడం యువతకు ఎంతో అదృష్టమని పేర్కొన్నారు. ఇది యువనేత, మంత్రి లోకేశ్ అకుంఠిత దీక్షకు నిదర్శనమని వివరించారు. ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు కల్పించాలన్నదే లోకేశ్ లక్ష్యమని చెప్పారు. ఈ ప్రాజెక్టు వల్ల ఎంతోమందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధికి అవకాశం లభిస్తుందని తెలిపారు. కూటమి ప్రభుత్వం యువత కలలు నిజం చేయడానికి నిరంతరం కృషి చేస్తోందని వివరించారు.

### పెద్ద కంపెనీలను జగన్ తరిమేశారు: డీబీవీ స్వామి

కూటమి పాలనలో భారీ పెట్టుబడులు, దిగ్గజ ఐటీ కంపెనీలు విశాఖ నగరానికి క్యూ కడుతున్నాయని మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి తెలిపారు. విశాఖలో గూగుల్ డేటా సెంటర్ దేశానికే తలమానికమన్నారు. ఏఐ డేటా సెంటర్ ఏర్పాటుతో విద్య, వైద్యం వ్యవసాయం సహా అనేక రంగాల్లో కీలక మార్పులు వస్తాయని చెప్పారు. సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ కృషి, శ్రమతో విశాఖ నగరం డేటా సెంటర్ హబ్‌గా ఎదుగుతోందని వెల్లడించారు. 16 నెలల్లోనే విశాఖకు 6.50 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని తెలిపారు. ఒప్పందాలు, భూ కేటాయింపులు పూర్తయిన సంస్థలు కార్యకలాపాలు ప్రారంభించేందుకు సిద్ధంగా ఉన్నాయన్నారు. వైకాపా హయాంలో ఐటీ కంపెనీలకు ఇవ్వాల్సిన రాయితీలు, ప్రోత్సాహకాలు ఎగ్గొట్టారని ధ్వజమెత్తారు. పెద్ద కంపెనీలను విశాఖ నుంచి జగన్ తరిమేశారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఐదేళ్లలో -మిగతా 2లో

## కర్నూలు పర్యటన.. తెలుగులో ప్రధాని మోదీ ట్వీట్



**(షణ్ముఖ వెలుగు,ఢిలీ,అక్టోబర్ 15)**

కర్నూలు పర్యటన నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోదీతెలుగులో ట్వీట్ చేశారు. "అక్టోబర్ 16న నేను ఆంధ్రప్రదేశ్‌లో ఉంటాను. శ్రీశైలంలోని శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి వార్ల దేవస్థానంలో పూజలు చేస్తాను. ఆ తర్వాత కర్నూలులో రూ.13,400 కోట్లకు పైగా విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో పాల్గొంటాను. ఈ పనులు విద్యుత్, రైల్వేలు, పెట్రోలియం, రక్షణ, పరిశ్రమలతో పాటు మరిన్ని రంగాలకు సంబంధించినవి" అని 'ఎక్స్'లో ప్రధాని పేర్కొన్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో -మిగతా 2లో

## ఉమ్మడి కృష్ణా జిల్లా నేతలతో మంత్రి కొల్లు రవీంద్ర భేటీ.. తాజా రాజకీయ పరిణామాలపై చర్చ



**(షణ్ముఖ వెలుగు, అమరావతి,అక్టోబర్ 15)**

ఉమ్మడి కృష్ణా జిల్లా ఎమ్మెల్యేలతో మంత్రి కొల్లు రవీంద్ర సమావేశమయ్యారు. నకిలీ మద్యం కేసు, జిల్లాలో తాజా రాజకీయ పరిణామాలు, భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. కూటమి ప్రభుత్వంలో రాష్ట్రంలో అద్భుతమైన అభివృద్ధి జరుగుతోందని మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. వైకాపా నేతలు రాష్ట్రంలో అస్థిరత తీసుకురావాలని చూస్తున్నారని మండిపడ్డారు. కుట్రలు అన్నీ కృష్ణా జిల్లా నుంచే జరగడం దురదృష్టకరమన్నారు. అన్ని మద్యం దుకాణాల వద్ద లిక్కర్ చెకింగ్ డివైజ్ పెడుతున్నామని, సామాన్యుడు కూడా తనిఖీ చేసుకోవచ్చన్నారు. సహజ మరణాలను కూడా లిక్కర్ మరణాలుగా చూపించి..

ప్రజలను భయాందోళనలకు గురిచేయాలని చూస్తున్నారని ధ్వజమెత్తారు.జగన్ జే బ్రాండ్స్ పెట్టి నకిలీ మద్యంతో దోపిడీ చేశారని ఏపీఎస్ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణ మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపిస్తుంటే.. వైకాపా దుష్ప్రచారం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. -మిగతా 2లో

## బిహార్ ఎన్నికలు.. జేడీ(యూ) తొలి విడత జాబితా విడుదల

**(షణ్ముఖ వెలుగు, అమరావతి,అక్టోబర్ 15)**

బిహార్ అసెంబ్లీ ఎన్నికల వేళ జేడీ(యూ) తన తొలి జాబితాను బుధవారం విడుదల చేసింది. బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయనున్న అభ్యర్థులకు సంబంధించి 57 స్థానాలను ప్రకటించింది.



ఇటీవల ఎన్డీఏ కూటమి చేసుకున్న సీట్ల పంపకాల ఒప్పందం ప్రకారం జేడీ(యూ) 101 సీట్లలో పోటీ చేయడానికి అంగీకరించగా.. ప్రస్తుతం 57 మంది అభ్యర్థుల పేర్లను ప్రకటించింది. రాజోగిర్ నుంచి కౌశల్ కిషోర్, కళ్యాణ్‌పూర్ నుంచి కేబినెట్ మంత్రి మహేశ్వర్ హజారీ, సోన్‌బార్సా నుంచి రత్నేష్ సదా, మోకామా నుంచి అనంత్ సింగ్, మీనాపూర్ నుంచి అజయ్ కుష్వాహాలు -మిగతా 2లో

## ఏపీలో డబుల్ ఇంజిన్ బుల్లెట్ ట్రైన్ సర్కార్ మంత్రి నారా లోకేశ్



**(షణ్ముఖ వెలుగు, అమరావతి,అక్టోబర్ 15)**

గతంలో మైక్రోసాఫ్ట్ హైదరాబాద్ రూపురేఖలు మార్చిందని.. ఇప్పుడు గూగుల్ పెట్టుబడులతో విశాఖ రూపురేఖలు మారబోతున్నాయని మంత్రి నారా లోకేశ్ అన్నారు. అమరావతిలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు."కేవలం డేటా సెంటర్ మాత్రమే కాదు.. ఏఐకి సంబంధించిన అనేక కంపెనీలు విశాఖకు వస్తున్నాయి. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ కింద రాష్ట్రానికి పరిశ్రమలు తరలివస్తున్నాయి. గూగుల్ పెట్టుబడితో లక్ష మందికి పైగా ఉపాధి -మిగతా 2లో

## పాకిస్థాన్‌ను అమ్మేశారుగా.. షెహబాజ్ షరీఫ్‌పై విమర్శలు



**(షణ్ముఖ వెలుగు,ఢిలీ,అక్టోబర్ 15)**

ఇజ్రాయెల్- హమాస్‌ల యుద్ధం ముగింపునకు సంబంధించి ఈజిప్టులోని షర్మ్-ఎల్- షేక్‌లో శాంతి ఒప్పందం జరిగిన విషయం తెలిసిందే. ఈ కార్యక్రమంలో పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ మాట్లాడుతూ.. ట్రంప్‌ను పొగడ్తలతో ముంచెత్తడంపై స్వదేశంలోనే పెద్ద ఎత్తున విమర్శలు వస్తున్నాయి. ట్రంప్ చేతిలో కీలుబొమ్మలా మారి.. పాక్‌ను అమ్మేశారంటూ నెటిజన్లు షరీఫ్‌ను దుయ్యబట్టారు. అమెరికా అధ్యక్షుడిని షరీఫ్ అంతలా పొగడాల్సిన అవసరం ఏముందని..ఆయన చర్యలు విదేశాల్లో తమ దేశాన్ని అవమానపరిచినట్లు ఉన్నాయని పాక్ నెటిజన్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయంపై పాక్‌కు చెందిన చరిత్రకారుడు అమర్ అలీ జాన్ సోషల్ మీడియా వేదికగా స్పందిస్తూ.. సమయం దొరికినప్పుడల్లా షరీఫ్ అనవసరంగా ట్రంప్‌ను ప్రశంసిస్తుండడం పాకిస్థానీయులకు ఇబ్బందికరంగా ఉందన్నారు. ఇతర దేశాల పర్యటనకు వెళ్లినప్పుడల్లా షరీఫ్ ట్రంప్ దృష్టిలో -మిగతా 2లో

## విశాఖకు గేమ్‌ఛేంజర్: ఎమ్మెల్యే గంటా

**(షణ్ముఖ వెలుగు, అమరావతి,అక్టోబర్ 15)**

సీఎం చంద్రబాబు, ఐటీశాఖ మంత్రి లోకేశ్‌ల కృషితో విశాఖపట్నం త్వరలో విశ్వనగరంగా మారబోతోందని మాజీ మంత్రి, భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు పేర్కొన్నారు. 'హైదరాబాద్‌కు మైక్రోసాఫ్ట్‌లా.. విశాఖపట్నానికి గూగుల్ డేటా సెంటర్ గేమ్ ఛేంజర్ కాబోతోంది. 30 ఏళ్లలో హైదరాబాద్ ఐటీ రంగంలో సాధించిన వృద్ధిని విశాఖపట్నం 10 ఏళ్లలోనే అందుకోబోతోంది. ఐటీ కంపెనీ ఏదైనా సరే విశాఖవైపు చూస్తోందంటే చంద్రబాబు, లోకేశ్ కృషే కారణం' అని ఆయన పేర్కొన్నారు. 'టీసీఎస్, కాగ్నిజెంట్, యాక్సెంచర్, సిఫీ తదితర కంపెనీలను తీసుకొచ్చిన చంద్రబాబు, లోకేశ్‌లు రాబోయే 20 ఏళ్లలో విశాఖపట్నాన్ని ట్రిలియన్ డాలర్ల ఆర్థిక ప్రాంతంగా తీర్చిదిద్దాలనే కృతనిశ్చయంతో ఉన్నారు. గూగుల్ సంస్థతో చేసుకున్న ఒప్పందం ప్రపంచ చిత్రపటంపై విశాఖను నిలబెడుతుంది' అని ప్రశంసించారు.



## అమెరికా నుంచి చమురు కొనుగోలు చేస్తాం కానీ భారత్ షరతు

సరైన ధరకు లభిస్తేనే ఈ అంశాన్ని ఆలోచిస్తామని వెల్లడి
ఈ మేరకు వాణిజ్య శాఖ కార్యదర్శి రాజేశ్ అగర్వాల్ వెల్లడి
అమెరికా నుంచి చమురు దిగుమతికి ఒప్పందం జరిగితే టారిఫ్ తగ్గే అవకాశం

**(షణ్ముఖ వెలుగు,ఢిలీ,అక్టోబర్ 15)**

అమెరికా నుంచి చమురు కొనుగోలుకు భారత్ సిద్ధంగా ఉందని, అయితే సరైన ధర లభిస్తేనే ఈ అంశాన్ని పరిశీలిస్తామని భారత్ స్పష్టం చేసింది. ఈ మేరకు వాణిజ్య శాఖ కార్యదర్శి రాజేశ్ అగర్వాల్ తెలిపారు. ప్రస్తుతం భారత్-అమెరికా మధ్య కొనసాగుతున్న వాణిజ్య చర్చల నడుమ ఆయన చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ఢిల్లీలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన ఈ విషయాలను వెల్లడించారు.అమెరికా నుంచి చమురు దిగుమతికి సంబంధించిన ఒప్పందం కుదిరితే, భారత దిగుమతులపై ఉన్న 50 శాతం -మిగతా 2లో

# బీచ్‌లకు వచ్చే పర్యాటకులు

## ప్రమాదాలకు గురికాకుండా చర్యలు తీసుకోవాలి

## జిల్లా కలెక్టర్ వి వినోద్ కుమార్



(షణ్ముఖ వెలుగు, బాపట్ల, అక్టోబర్ 15) చీరాల రామాపురం బీచ్‌లకు వచ్చే పర్యాటకులు ప్రమాదాలకు గురికాకుండా ప్రణాళికలు తయారు చేయాలని జిల్లా కలెక్టర్ వి.వినోద్ కుమార్



అధికారులను ఆదేశించారు. బుధవారం బాపట్ల, చీరాల రామాపురం బీచ్‌లలో పర్యాటకులు ప్రమాదాల గురికాకుండా తీసుకోవాల్సిన చర్యలపై జిల్లా కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఇటీవల రామపురం బీచ్ లో 5గురు పర్యాటకులు ఈతకొడుతూ ప్రమాదానికి గురై మరణించారని ఆయన అన్నారు. బాపట్ల, చీరాల,రామాపురం బీచ్ లో పర్యాటకులు భవిష్యత్తులో ప్రమాదాలు జరగ కుండా చర్యలు తీసుకోవాలని ఆయన చెప్పారు. బీచ్ లో సముద్ర స్నానానికి వచ్చే పర్యాటకులకు ఆడియో, వీడియోల ద్వారా అవగాహన కల్పించాలని ఆయన చెప్పారు. సముద్ర తీర ప్రాంతం వద్ద మైకుల ద్వారా అనౌన్స్మెంట్ ఏర్పాటు చేయాలని ఆయన అధికారులకు సూచించారు. సముద్రంలోకి స్నానానికి వెళ్లేవారు మద్యం సేవించకుండా వెళ్లే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. మద్యం సేవించిన వారిని తనిఖీలు చేపట్టడానికి పోలీస్ సిబ్బందికి బ్రీత్ ఎనలైజర్ లను ఏర్పాటు చేస్తామని ఆయన చెప్పారు. సముద్రంలో ఈతకు వెళ్లే పర్యాటకులకు సముద్రంలో నిర్దిష్టమైన లోతు వరకు మాత్రమే వెళ్లే విధంగా వారికి సూచనలు చేయాలని ఆయన చెప్పారు. రిసార్ట్లకు వచ్చే పర్యాటకులకు ప్రమాదాలపై అవగాహన కల్పించాలని రిసార్ట్ యాజమాన్యానికి కలెక్టర్ సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా టూరిజం అధికారి నాగిరెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి విజయమ్మ, జిల్లా అగ్నిమాపక అధికారి వినోద్, జిల్లా అధికారులు, బాపట్ల, చీరాల, రామాపురం రిసార్ట్స్ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# సింగరబొట్లపాలెంలో గ్లోబల్ హ్యాండ్ వాషింగ్ డే వేడుకలు



(షణ్ముఖ వెలుగు, పొన్నలూరు, అక్టోబర్ 15) మండలంలోని సింగరబొట్ల పాలెం ప్రాథమిక పాఠశాలలో బుధవారం గ్లోబల్ హ్యాండ్ వాషింగ్ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో డాక్టర్ సుజాత మాట్లాడుతూ విద్యార్థులు పరిశుభ్రత పాటించాలని మలమూత్ర విసర్జన తరువాత, ఆటలు ఆడుకున్న తర్వాత చేతులను శుభ్రం చేసుకోవాలని చేయని యెడల వివిధ రోగాలు వచ్చే ప్రమాదం ఉందని తెలిపారు. కార్యక్రమంలో రమణారెడ్డి, రాఘవరెడ్డి, ప్రధానోపాధ్యాయుడు చంద్రశేఖర్, డిప్యూటీ ఎంపీడీవో నారాయణ, పంచాయతీ కార్యదర్శి కే గీత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# రిలే నిరాహార దీక్ష చేస్తున్న వైద్యులకు సంఘీభావం




(షణ్ముఖ వెలుగు, పొన్నలూరు, అక్టోబర్ 15) స్థానిక ప్రాథమిక వైద్యశాలలో బుధవారం విజయవాడలో వైద్యులు తమ డిమాండ్ల కోసం 11 రోజులుగా ధర్నా చౌకలో రిలే నిరాహార దీక్ష చేస్తున్న వైద్య అధికారులకు పొన్నలూరు ప్రాథమిక వైద్యశాల సిబ్బంది సంఘీభావం తెలిపారు.

మొదటి పేజీ తరువాయి

# పథకాల అమలు తీరు తెలుసుకునేందుకు నవంబర్ నుంచి క్షేత్రస్థాయిలో పర్యటిస్తా

ప్రజలకు కలిగిన ప్రయోజనాలు, లబ్ధి తదితర అంశాలపై ప్రజల నుంచి సేకరించిన ఫీడ్‌బ్యాక్ వివరాలను ముఖ్యమంత్రి పరిశీలించారు. నిత్యావసరాలు, ఇతర ఉత్పత్తులపై పన్నులు తగ్గిన అంశంపై గిరిజన ప్రాంతాల్లో మరింత అవగాహన కల్పించాలని సూచించారు. దీపావళి పండుగ తర్వాత కూడా సూపర్ జీఎస్టీ ద్వారా పన్నుల తగ్గింపు, తద్వారా ధరలు తగ్గిన అంశాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని పేర్కొన్నారు. జీఎస్టీ 2.0 సంస్కరణల వల్ల కలిగే లబ్ధిని స్లైడ్స్ ద్వారా సినిమా థియేటర్లలో ప్రదర్శించాలని ముఖ్యమంత్రి సూచించారు.

**వన్ గవర్నమెంట్ – వన్ సిటిజన్ విధానంతో ప్రభుత్వ సేవలు**

వివిధ శాఖలు అందించే ప్రభుత్వ సేవలపై టెక్నాలజీ డేటా ఆడిటింగ్ ద్వారా సంతృప్తస్థాయిని అంచనా వేస్తామని స్పష్టం చేశారు. క్షేత్రస్థాయిలో వాస్తవాలకు అధికారులు ఇచ్చే సమాచారానికి పొంతన ఉండాలని ముఖ్యమంత్రి అన్నారు. సామాన్యుడికి మెరుగైన సేవలు అందించటమే లక్ష్యంగా పనిచేస్తున్నట్టు ముఖ్యమంత్రి వెల్లడించారు. వన్ గవర్నమెంట్ వన్ సిటిజన్ అన్న విధానంతో సమర్ధవంతంగా ప్రజలకు సేవలందిస్తామని అన్నారు.దీనిపై నవంబరు మొదటి వారంలో మంత్రులు, కార్యదర్శులు, కలెక్టర్ల పనితీరును మదింపు చేస్తామని సీఎం అన్నారు. ఇన్సిడెంట్ మేనేజ్‌మెంట్ సిస్టం ద్వారా వేర్వేరు ఘటనల్ని సమన్వయంతో పర్యవేక్షించటంతో పాటు త్వరితగతిన బాధితులకు స్వాంతన కలిగించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే ఈ అంశాలను ఎప్పటికప్పుడు ప్రజలకు తెలియచేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో ట్రాఫిక్ చలానాల పేరిట వాహనదారులను ఇబ్బందులు పెట్టవద్దని ముఖ్యమంత్రి సూచించారు.

**సాంకేతికతతోనే రాజకీయ కుట్రలు బట్టబయలు**

రాష్ట్రంలోని కొన్ని అంశాలను రాజకీయంగా ఉపయోగించుకుని నేరాలు చేసేందుకు కొందరు ప్రయత్నాలు చేస్తున్నారని, ఈ తరహా వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి సూచించారు. పీపీపీ విధానంలో మెడికల్ కళాశాలలు నిర్మిస్తుంటే ప్రైవేటు పరం చేస్తున్నారంటూ దుష్ప్రచారం చేస్తున్నారని ఆక్షేపించారు. పీపీపీ ద్వారా వచ్చే మెడికల్ కాలేజీల్లో పేద విద్యార్థులకు అదనంగా మరిన్ని సీట్లు అందుబాటులోకి రావటంతో పాటు పేదలకు నాణ్యమైన ఉచిత వైద్యం కూడా లభిస్తుందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.అంబేద్కర్ విగ్రహానికి నిప్పు పెట్టి ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత పెంచేందుకు కూడా కొందరు కుట్రలు చేశారని సకాలంలో సాంకేతికత వినియోగించి వారి బండారం బయట పెట్టామన్నారు. ఇప్పుడు నకిలీ మద్యం తయారు చేసి తిరిగి ప్రభుత్వంపై బురద చల్లే ప్రయత్నం చేస్తున్నారని ముఖ్యమంత్రి అన్నారు. ఈ సమీక్షకు సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి, ఐటీ, ఆర్టీజీఎస్, ఎక్సైజ్, భూగర్భ జల వనరుల శాఖ అధికారులు హాజరయ్యారు.

# గూగుల్‌తో ఏపీ ప్రభుత్వం ఒప్పందం.. ఆంధ్రప్రదేశ్‌లో నవశకం: మంత్రి పార్థసారథి

విశాఖ కేంద్రంగా యువతకు భారీగా ఐటీ ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా మంత్రి లోకేశ్ శ్రమిస్తున్నారని వెల్లడించారు. అసలైన వికేంద్రీకరణ సాధకుడు చంద్రబాబు: ఎమ్మెల్సీ పంచుమర్తి ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ కృషి వల్లే రాష్ట్రానికి గూగుల్ క్లౌడ్ వచ్చిందని, ఇది చరిత్రాత్మక విజయమని ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ తెలిపారు. గూగుల్ సంస్థ రాష్ట్రానికి రావడంతో లక్షకు పైగా ఉద్యోగావకాశాలు రానున్నాయన్నారు. చంద్రబాబు బ్రాండ్‌తోనే ఏపీకి భారీ పెట్టుబడులు వస్తున్నాయని, 'స్వర్ణాంధ్ర 2047'కు గూగుల్ క్లౌడ్ ఓ మైలురాయి అని అభివర్ణించారు. తండ్రి మైక్రోసాఫ్ట్, తనయుడు గూగుల్ సంస్థను తీసుకొచ్చి అభివృద్ధికి కృషి చేస్తున్నారని ప్రశంసించారు. అసలైన వికేంద్రీకరణ సాధకుడు చంద్రబాబు అని కొనియాడారు.

# కర్నూలు పర్యటన.. తెలుగులో ప్రధాని మోదీ ట్వీట్

ప్రధాని మోదీ పర్యటనను విజయవంతం చేసేందుకు ఏపీ సర్కారు అన్ని విధాలా ఏర్పాట్లు చేసింది. రాష్ట్ర మంత్రుల ఉన్నత స్థాయి బృందం ఇప్పటికే నంద్యాలకు చేరుకొని ఏర్పాట్లపై సమీక్షించింది. మోదీ పర్యటనను చరిత్రాత్మక పర్యటనగా గుర్తుండిపోయేలా విజయవంతం చేయాలని మంత్రులు ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. కార్యక్రమం విజయవంతం చేసేందుకు క్షేత్రస్థాయిలో కూటమి పార్టీల శ్రేణులు ఎలా పనిచేయాలనే దానిపై దిశానిర్దేశం చేశారు.

# పాకిస్థాన్‌ను అమ్మేశారుగా.. షెహబాజ్ షరీఫ్‌పై విమర్శలు

పడడానికి ఏవేవో ప్రయత్నాలు చేస్తుంటారని..వాటివల్ల ప్రపంచ దేశాల ముందు ఆయన చులకన అవుతారని ఓ నెటిజన్ విమర్శించారు.

**షరీఫ్ ట్రంప్‌ను ఏమని పొగిడారంటే?**

ఇటీవల ఈజిప్టులోని షర్మ్- షేక్‌లో జరిగిన శాంతి ఒప్పంద సమావేశంలో షరీఫ్ మాట్లాడుతూ..ట్రంప్‌పై పొగడ్తల వర్షం కురిపించారు. 'ఈ రోజు చరిత్రలో గొప్ప రోజులలో ఒకటి. ఎందుకంటే అధ్యక్షుడు ట్రంప్ నేతృత్వంలో అవిశ్రాంత ప్రయత్నాల తర్వాత గాజాలో శాంతి సాధన అయ్యింది. ఆయన నిజంగా శాంతిని కోరుకునేవాడు. ట్రంప్ ఈ ప్రపంచాన్ని శాంతి, శ్రేయస్సుతో జీవించేలా చేసేందుకు అవిశ్రాంతంగా కృషి చేశారు' అని కొనియాడారు. ఈ సందర్భంగా భారత్–పాక్ మధ్య జరిగిన ఘర్షణను కూడా ట్రంపే ఆపారంటూ క్రెడిట్ ఇచ్చేశారు. నాలుగు రోజుల్లో ట్రంప్, ఆయన అద్భుతమైన బృందంతో జోక్యం చేసుకోకపోతే.. ఆ ఘర్షణలు పశ్చిమాసియాకు విస్తరించి ఉండేవి. ఏం జరిగిందో చెప్పేందుకు కూడా ఎవరూ మిగిలేవారు కాదంటూ వ్యాఖ్యానించారు.

# అమెరికా నుంచి చమురు కొనుగోలు చేస్తాం కానీ భారత్ షరతు

సుంకాలు తగ్గే అవకాశముందని అధికారులు భావిస్తున్నారు. గతంలో అమెరికా భారత్ 22–23 బిలియన్ డాలర్ల విలువైన ఇంధనం కొనుగోలు చేసేది కాదని రాజేశ్ తెలిపారు. సుమారు మరో 12 నుంచి 13 బిలియన్ డాలర్ల విలువైన చమురు కొనుగోలుకు అవకాశం ఉందని చెప్పారు. అయితే దీనిపై తుది నిర్ణయం రావాల్సి ఉంది. రష్యా నుంచి తక్కువ ధరకు ముడి చమురు కొనుగోళ్లు కొనసాగిస్తున్నందుకు భారత్‌పై అమెరికా అధిక టారిఫ్ విధించిన విషయం తెలిసిందే.

# ఉమ్మడి కృష్ణా జిల్లా నేతలతో మంత్రి కొల్లు రవీంద్ర భేటీ.. తాజా రాజకీయ పరిణామాలపై చర్చ

నకిలీ మద్యం కేసులో నిందితుడు అద్దేపల్లి జనార్దనరావు జైల్లో ఉండగా.. జోగి రమేశ్ పేరు చెబుతాడని ఎలా తెలుసని మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ ప్రశ్నించారు. జోగి రమేశ్ తన సొంత సామాజికవర్గం వారి దగ్గర డబ్బులు తీసుకుని షిఫ్ట్ ఆపరేటర్ ఉద్యోగాలు ఇప్పించాడని ఆరోపించారు. పెనమలూరు ఎమ్మెల్యే బోడె ప్రసాద్, విజయవాడ తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, సీనియర్ నేత నెట్టెం రఘురాం తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.

# బిహార్ ఎన్నికలు.. జేడీ(యూ) తొలి విడత జాబితా విడుదల

బరిలోకి దిగుతున్నారు. ఇప్పటికే ఎన్నికల్లో పోటీ చేయనున్న పార్టీ అభ్యర్థుల తొలి జాబితాను భాజపా విడుదల చేసింది. బిహార్ శాసనసభ ఎన్నికల్లో ఎన్డీయే కూటమిలో ప్రధాన భాగస్వామ్యపక్షాలైన భాజపా, జేడీ(యూ) చెరో 101 స్థానాల్లో పోటీ చేయనున్నాయి. 243 స్థానాలు ఉన్న అసెంబ్లీలో లోక్‌జన్‌శక్తి (రాంవిలాస్) 29 చోట్ల, హిందుస్థాన్ అవామ్ మోర్చా (హెచ్‌ఏఎం) ఆరుచోట్ల, రాష్ట్రీయ లోక్‌మోర్చా (ఆర్‌ఎల్‌ఎం) ఆరుచోట్ల బరిలో దిగేలా సీట్ల సర్దుబాటు కుదిరింది. భాజపా కంటే జేడీ(యూ) ఎక్కువ స్థానాల్లో పోటీ చేయకపోవడం ఇదే తొలిసారి. కాగా మరోవైపు టికెట్ పంపిణీపై అనేకమంది జేడీ(యూ) నేతలు అభ్యంతరాలు వ్యక్తంచేస్తున్నారు. పార్టీ టికెట్ కోసం నీతీశ్ ఇంటివద్ద పార్టీకి చెందిన గోపాల్‌పుర్ ఎమ్మెల్యే గోపాల్ మండల్ మంగళవారం ధర్నాకు దిగారు. నవంబర్ 6, 11 తేదీల్లో బిహార్ అసెంబ్లీ ఎన్నిక నిర్వహించనున్నట్లు ఇటీవల ఎన్నికల సంఘం ప్రకటించింది. రాష్ట్రంలోని 243 అసెంబ్లీ స్థానాలకు రెండు దశల్లో ఎన్నికలు జరుగుతాయని.. నవంబర్ 14న ఓట్ల లెక్కింపు నిర్వహిస్తామని తెలిపాయి. ప్రస్తుతం బిహార్‌లో ఎన్డీయే ప్రభుత్వం అధికారంలో ఉంది.

# ఏపీలో డబుల్ ఇంజిన్ బుల్లెట్ ట్రైన్ సర్కార్ మంత్రి నారా లోకేశ్

అవకాశాలు కలగనున్నాయి. సెప్టెంబర్ 2024లో గూగుల్ ప్రతినిధులు విశాఖ వచ్చినప్పుడు వారితో సమావేశమయ్యాను. వారికి డేటా సెంటర్ స్థలాన్ని చూపించాం. ఇది జరిగిన నెల రోజుల్లో యూఎస్ వెళ్లి గూగుల్ క్లౌడ్ నాయకత్వాన్ని కలిశా. నవంబర్‌లో గూగుల్ ప్రతినిధులు సీఎంను కలిశారు. ఇదే అంశంపై ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్‌తో చంద్రబాబు అనేకసార్లు భేటీ అయ్యారు. అనేక చర్చల తర్వాత ఇంత పెద్ద పెట్టుబడి సాధ్యమైంది. భారీ పెట్టుబడులపై అన్ని చోట్లా చర్చలు జరుగుతున్నాయి.

**అభివృద్ధి వికేంద్రీకరణ మా లక్ష్యం**

ఒకే రాష్ట్రం.. ఒకే రాజధాని.. అభివృద్ధి వికేంద్రీకరణ మా లక్ష్యం. అనంతపురం, కర్నూలుకు పంప్డ్ స్టోరేజ్, సిమెంట్ ఫ్యాక్టరీలు వస్తున్నాయి. చిత్తూరు, కడపలో ఎలక్ట్రానిక్స్ మ్యానుఫ్యాక్చరింగ్ ఎకో సిస్టమ్‌ను తీర్చిదిద్దుతున్నాం. శ్రీసిటీ గ్రేటర్ ఎకోసిస్టమ్‌లో అనేక పెట్టుబడులు తీసుకొస్తున్నాం. డైకెన్, బ్లూస్టార్, ఎల్జీ పెట్టుబడులు పెరుగుతున్నాయి. ప్రకాశం జిల్లాలో రిలయన్స్ ఇండస్ట్రీస్ పెద్దఎత్తున పెట్టుబడులు పెడుతోంది. అమరావతిలో క్వాంటమ్ కంప్యూటింగ్ తీసుకొస్తున్నాం. ఉభయ గోదావరి జిల్లాల్లో ఆక్వాను పెద్దఎత్తున ప్రోత్సహిస్తున్నాం. ఉత్తరాంధ్రలో టీసీఎస్, కాగ్నిజెంట్, యాక్సెంచర్ వంటి సంస్థలు పెట్టుబడులు పెడుతున్నాయి. అన్ని ప్రాంతాలను సమగ్ర అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నాం. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో ఏపీ ప్రథమ స్థానంలో ఉంది. ఎంవోయూలపై సంతకాలు కాదు.. ఆచరణలో చేసి చూపిస్తున్నాం. 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామన్న హామీకి కట్టుబడి ఉన్నాం. ఐటీ రంగంలోనే 5 లక్షల ఉద్యోగాలు కల్పించాలని ఛాలెంజ్‌గా తీసుకున్నాం. ఏ ఒక్క కంపెనీ కూడా మన రాష్ట్రం నుంచి వెళ్లే పరిస్థితి రాదు. గత ఐదేళ్లలో ఏపీలో విధ్వంసం జరిగింది. అన్ని రాష్ట్రాల్లో డబుల్ ఇంజిన్ సర్కార్లు ఉన్నాయి.. ఏపీలో మాత్రం డబుల్ ఇంజిన్ బుల్లెట్ ట్రైన్ ఉంది. దిల్లీలో ప్రధాని మోదీ, ఏపీలో సీఎం చంద్రబాబు కలిసి పనిచేయడం వల్లే ఇది సాధ్యమైంది.

**నవంబర్‌లో మరిన్ని శుభవార్తలు**

చరిత్ర సృష్టించాలన్నా.. తిరగరాయాలన్నా చంద్రబాబుతోనే సాధ్యం. ఆనాడు కియా ఏర్పాటుతో చరిత్ర సృష్టించాం. విశాఖలో గూగుల్ 15 బిలియన్ డాలర్ల భారీ పెట్టుబడి పెడుతోంది. విశాఖలో గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటు అతిపెద్ద విజయం. నవంబర్‌లో మరిన్ని శుభవార్తలు ఉంటాయి. వైకాపా పేటీఎం బ్యాచ్ తప్పుడు ప్రచారాలను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరు. డేటా సెంటర్ అంటే ఏంటో గతంలో పనిచేసిన మంత్రికి తెలుసా? నవంబర్ నుంచి విద్యుత్ ఛార్జీలు యూనిట్‌కు 13 పైసలు తగ్గేలా చర్యలు తీసుకుంటాం" అని నారా లోకేశ్ తెలిపారు.

# నిందితులను వెంటనే అరెస్టు చేయాలి




(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, అక్టోబర్ 15) కనిగిరి మండలం మాచవరం గ్రామంలో పాస్టర్ కుడుముల ప్రకాష్ తన గ్రామంలో సొంత స్థలంలో చర్చి నిర్మించుకోవడాన్ని జీర్ణించుకోలేక కొంతమంది పాస్టర్ ప్రకాశం పై కక్ష పెట్టుకుని అతనిని అనేక ఇబ్బందులు పెట్టి కులం పేరుతో దూషించి అతనిపై ఆగస్టు 5 2025 నా తీవ్రంగా దాడి చేయడం జరిగిన తర్వాత ఆయన అజ్ఞాతంలోకి వెళ్లిపోయాడు శనివారం ఒంగోలులో ఉన్నట్లు తెలిసి ఆయన సోదరి అలీసమ్మ అతనిని చికిత్సకు ఒంగోలు రిమ్స్ హాస్పిటల్ లో అడ్మిట్ చేయగా చికిత్స పొందుతూ నిన్న ఉదయం మరణించాడు. వెంటనే అప్రమత్తమైన ఎమ్మార్పీఎస్ నాయకులు ఇది కుట్ర పూరితమైన హత్యగా పరిగణించి ఆయనపై దాడి చేసిన వ్యక్తుల మీద వెంటనే హత్య కేసు , ఎస్సీ , ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి వెంటనే అరెస్టు చేయాలని ఎమ్మార్పీఎస్ ప్రకాశం జిల్లా అధ్యక్షులు నేలపాటి రాజు మాదిగ. కనిగిరి నియోజకవర్గ ఇన్చార్జి రావినూతల కోటయ్య మాదిగ కనిగిరి మండల అధ్యక్షులు మాసిపోగు బాబు మాదిగ వెలిగండ్ల ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు గూడూరి శేఖర్ మాదిగ, ఎంఎస్పీ అధ్యక్షులు జుట్టుకే డానియల్ మాదిగ ,ఉపాధ్యక్షులు పల్లిపోగు యోహాను మాదిగ ,ప్రధాన కార్యదర్శి కుమ్మరికుంట రాజు మాదిగ ,పీసీపల్లి ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు గంగవరపు రోజెస్ మాదిగ ,ఉపాధ్యక్షులు అంద్ర మల్లికార్జున మాదిగ, కనిగిరి మండల నాయకులు వంగెపురపు జీవరత్నం మాదిగ , హెచ్ఎం పాడు మండల అధ్యక్షుడు జుటికే రామయ్య మాదిగ, కనిగిరి ఎంఎంఎస్ అధ్యక్షురాలు జయ మాణిక్యం మాదిగ డిమాండ్ చేసారు. ఎమ్మార్పీఎస్ నాయకుల డిమాండ్ మేరకు కనిగిరి సిఐ గతంలో నమోదు చేసిన కేసును సవరించి పాస్టర్ ప్రకాష్‌ది హత్య కేసుగా నమోదు చేసారు. త్వరితగతిన నిందితులను కూడా అరెస్టు చేస్తామని హామీ ఇచ్చారు.



షణ్ముఖ వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక
ప్రకాశం

## తహసీల్దార్ కార్యాలయ అవినీతి పై విచారణ



(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, అక్టోబర్ 15)

కనిగిరి తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన భూ రికార్డులు, మ్యుటేషన్‌ల పై బుధవారం సాయంత్రం వరకు ఒంగోలు ఆర్డీఓ కళావతి విచారణ చేపట్టారు. కనిగిరి మండలం నందు జరిగిన రికార్డుల అవకతవకలు, మ్యుటేషన్ల పై కలెక్టర్ కి ఫిర్యాదు చేయడంతో ఒంగోలు ఆర్డీఓ కళావతిని విచారణకు ఆదేశించారు. కొంత వరకే రికార్డుల తనిఖీ జరిగిందని, గురువారం పూర్తి స్థాయిలో తనిఖీ చేసి జరిగిన అవినీతి పై కలెక్టర్‌కి నివేదిక సమర్పించడం జరుగుతుందని వెలిగండ్ల తహసీల్దార్ వాసు విలేకరుల సమావేశంలో తెలిపారు.

# అంగరంగ వైభవంగా మాగుంట పుట్టినరోజు వేడుకలు













(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, అక్టోబర్ 15)

ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులు రెడ్డి జన్మదిన వేడుకలు ఒంగోలు రాంనగర్ లోని ఆయన నివాసంలో అంగరంగ వైభవంగా జరిగాయి,మాగుంట అభిమానులు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేడుకల్లో జిల్లా నలుమూలల నుంచి ప్రజానీకం తరలివచ్చారు,యువ నాయకులు మాగుంట రాఘవ రెడ్డి .నికిల్ రెడ్డి తోపాటు జిల్లా ప్రజా ప్రతినిధులు అధికారులు కూటమి నాయకుల సమక్షంలో అర్చకుల ఆశీర్వాదములు అందించిన అనంతరం భారీ కేక్ ను ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి కట్ చేశారు. సుదీర్ఘ కాలంపాటు ఒంగోలు ఎంపీగా పని చేసిన నాయకులు మాగుంట శ్రీనివాసులురెడ్డి అని రాష్ట్ర మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి అన్నారు. రాజకీయ రంగంలో తోపాటు ప్రజా క్షేత్రంలో ప్రజల మన్నలను పొందిన మాగుంట శ్రీనివాసులురెడ్డి మరెన్నో జన్మదిన వేడుకలు జరుపుకోవడంతో పాటు ఉన్నత పదవులు అలంకరించాలని పిడిసిసి బ్యాంక్ పర్సన్ ఇంచార్జి డాక్టర్ కామేపల్లి సీతారామయ్య ఆకాంక్షించారు. జిల్లా అభివృద్ధిలో మాగుంట కుటుంబం ఒక ప్రత్యేకతను చాటుకుందని సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్.విజయ్ కుమార్ అన్నారు. సేవా గుణమే పరమావతిగా పని చేస్తూ జిల్లా ప్రజల హృదయాల్లో నిలిచిన వ్యక్తి మాగుంట శ్రీనివాసులురెడ్డి అని పర్యాటక కార్పొరేషన్ చైర్మన్ నుకసాని బాలాజీ కొనియాడారు,ప్రకాశం జిల్లాకు మాగుంట కుటుంబం ఒక వరం అని అన్న ఒడా చైర్మన్ షేక్.రియాజ్ జిల్లా ప్రజలకు మరింత సేవలు అందించాలని ఆకాంక్షించారు. అనం తరం ప్రజా ప్రతినిధులు అధికారులు కూటమి నాయకులు మాగుంట అభిమానులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి ఆయను పుష్ప గుచ్చాలు అందజేసి జన్మదిన శు భాకాంక్షలు తెలియజేశారు. కార్య క్రమంలో టీడీపీ పార్టీ నియోజకవర్గ పరిశీలకులు వినుకొండ సుబ్రమణ్యం, అద్దంకి నియోజకవర్గ టిడిపి ఇన్చార్జి గొట్టిపాటి లక్ష్మీ దంపతులు, మాజీ శాసన సభ్యులు గరటయ్య,దారా సాంబయ్య, జనసేన నాయకులు కంది రవిశంకర్ , శిద్దా సుధీర్ కుమార్, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర రావు,మాజీ ఏఎంసీ చైర్మన్ అయినబత్తిన ఘనశ్యామ్,బెల్లం సత్యనారాయణ, మాజీ సూపర్ బజార్ చైర్మన్ తాత ప్రసాద్,కుప్ప రంగసాయి, ఆత్మకూరి బ్రమ్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

## తన రాజకీయ వారసుడు మాగుంట రాఘవరెడ్డి

### రాఘవరెడ్డిని ఆదరించాలని

### ప్రజలను, అభిమానులను కోరిన ఎంపి మాగుంట శ్రీనివాసులు రెడ్డి



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, అక్టోబర్ 15)

మాగుంట కుటుంబం పట్ల ప్రకాశం జిల్లా ప్రజలు చూపుతున్న అభిమానం ఎన్నటికి మరువ లేనిదని ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డి అన్నారు. ఆయన పుట్టినరోజుని పురస్కరించుకొని రామ్‌నగర్ రెండవ లైన్ నందు ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన వేడుకల్లో భాగంగా జిల్లా ప్రజలు, అభిమానులను ఉద్దేశించి మాగుంట మాట్లాడారు. 1991లో కీర్తిశేషులు మాగుంట సుబ్బరామిరెడ్డి ప్రకాశం జిల్లాలో రాజకీయరంగం ప్రవేశం చేయగా ఆయన మరణానంతరం మాగుంట పార్వతమ్మ రాజకీయ ప్రస్థానం కొనసాగించారని తెలిపారు. అనంతరం తాను పార్లమెంట్ సభ్యులుగా పోటీ చేయడం జరిగిందని ఈ సందర్భంగా మాగుంట శ్రీనివాసులురెడ్డి గుర్తు చేశారు. ఐదు పర్యాయాలు పార్లమెంట్ సభ్యులుగా జిల్లా ప్రజలకు తనకు అవకాశం కల్పించారని, రానున్న కాలంలో తన రాజకీయ వారసుడిగా మాగుంట రాఘవరెడ్డి కొనసాగుతారని ఆయనను కూడా జిల్లా ప్రజలందరూ ఆదరించాలని మాగుంట శ్రీనివాసులురెడ్డి కోరారు.

## మీరు చెబితే సిబిఐ విచారణకు ఆదేశిస్తామా ?

### ఎప్పుడు ఏం చేయాలో మాకు తెలుసు
### ఇప్పటికే సమర్థవంతమైన అధికారులతో సిట్ వేసాం
### నకిలీ మద్యం ఏరులై పారింది వైసిపి పాలనలోనే ప్రజారోగ్యమే మాకు ముఖ్యం
### నాణ్యమైన మద్యాన్ని అందిస్తున్నాం
### సిట్ విచారణ పూర్తయిన తర్వాత అరెస్టులు తప్పవు
### విశాఖకు గూగుల్ డేటా సెంటర్ వస్తే స్వాగతించకుండా విమర్శలా
### వైసీపీ నేతల పై మంత్రి ‘ డోలా ’ ఫైర్




(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, అక్టోబర్ 15)

అధికారంలో మీరున్నారా... మేమున్నామా.. సిబిఐ ఎంక్వయిరీ అవసరమైతే ఎప్పుడు వేయాలో మాకు తెలుసు అంటూ వైసీపీ నేతల పై రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి ఫైర్ అయ్యారు. ఒంగోలులో బుధవారం ఒంగోలు వచ్చిన మంత్రి మీడియాతో మాట్లాడుతూ వైసిపి పాలనలో రాష్ట్రంలో నకిలీ మద్యం ఏరులై పారిందన్నారు. ఆ బురదను కూటమి ప్రభుత్వానికి అంటగట్టేందుకు వైసీపీ ప్రయత్నిస్తుందని విమర్శించారు. జోగి రమేష్ ఆడియో క్లిప్పింగులతో వైసీపీ నాటకమంతా బయటపడిందన్నారు. ఈపాటికి నకిలీ మద్యం పై సమర్థవంతమైన అధికారులతో సిట్ వేశామన్నారు. సిట్ విచారణ పూర్తయిన వెంటనే దోషులను అరెస్టు చేస్తామన్నారు. సిబిఐ విచారణ ఎప్పుడు వేయాలో మాకు తెలుసు అన్నారు. ఇప్పటికే ఆ పార్టీ అధినేత తన తండ్రి హయాంలో చేసిన లక్ష కోట్ల అవినీతి పై విచారణ ఎదుర్కొంటూ పారిపోయి తిరుగుతున్నారని అవహేళన చేశారు. విశాఖపట్నంలో గూగుల్ డేటా సెంటర్ వస్తే స్వాగతించాల్సింది పోయి విమర్శలు చేయటం సిగ్గుచేటు అన్నారు. ఏ ఐ డేటా సెంటర్ ద్వారా రాష్ట్రంలో విద్య, వైద్యం, వ్యవసాయం తోపాటుగా పలు రంగాలలో కీలకమైన మార్పులు చోటు చేసుకున్నాయని అన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేష్ ఎంతో కష్టపడి రాష్ట్రానికి పెట్టుబడులు, ఒప్పందాలు తెస్తున్నారన్నారు. ఈపాటికి భూ కేటాయింపులు పూర్తయిన పలు కంపెనీలు తమ కార్యకలాపాలు ప్రారంభించేందుకు సిద్ధంగా ఉన్నాయన్నారు. ఐటీ కంపెనీలకు రాయితీలు, ప్రోత్సాహకాలు ఇవ్వకుండా రాష్ట్రం నుండి తరిమివేసిన ఘనత వైసీపీ ది అన్నారు. విశాఖలో ఐటీ రంగం ద్వారా లక్షలాది ఉద్యోగాలు వచ్చే అవకాశం ఉందని పేర్కొన్నారు. విశాఖపట్నం ఐటి హబ్ గా మారుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

## వాసవి స్కూల్లో ఏపిజె అబ్దుల్ కలామ్ జయంతి




(షణ్ముఖ వెలుగు, మార్కాపురం ఇన్‌ఛార్జి, అక్టోబర్ 15)

మార్కాపురం పట్టణంలో వాసవి విధ్యానికేతన్ నందు బుధవారం ఏపిజె అబ్దుల్ కలాం జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో ప్రధానోపాద్యులు కె రంగయ్య, ఏవో రంజిత్, ఇంచార్జులు, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి చైర్మన్ రంగయ్య మాట్లాడుతూ అబ్దుల్ కలామ్ గొప్ప మహనీయుడు, ఆయన మన భారతదేశం జన్మించడం, నిజంగా ఈ దేశానిక గర్వకారణమన్నారు. ఆయన భారత 11వ రాష్ట్రపతి, శాస్త్రవేత్త. అలాగా ఇస్రో లో ఏరోస్పేస్" ఇంజనీర్ గా పనిచేసారు. "భారత దేశపు మిసైల్ మ్యాన్‌గా పేరుగాంచారు. 1969 లో భారత అంతరిక్ష పరిశోధన సంస్థలో, చరి, ఇస్రో మొట్టమొదటి స్వదేశీ ఉపగ్రహ ప్రయోగ వాహనం తయారీలో పని చేసారు,అని అన్నారు. ఈ కార్యక్రమంలో చేసినందుకు కె. రంగయ్య అందరికి పాల్గొని జయప్రదం చేసినందుకు ధన్యవాదాలు తెలిపారు.

## ఘనంగా స్వర్గీయ భారత మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం 94వ జయంతి వేడుకలు

### తల్లి తండ్రి లేని విద్యార్థులను దత్తత తీసుకున్న బిజెపి నాయకులు షేక్ షబానా, పివి కృష్ణారావు



(షణ్ముఖ వెలుగు, మార్కాపురం ఇన్‌ఛార్జి, అక్టోబర్ 15)

పట్టణంలోని ప్రభుత్వ బాలుర పాఠశాల నందు బిజెపి మైనార్టీ మోర్చా మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు షేక్ షబానా ఆధ్వర్యంలో డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం 94వ జయంతి పురస్కరించుకొని విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్స్ అందించి స్వీట్లను పంపిణీ చేశారు. ముందుగా పాఠశాల ప్రాంగణంలో గల అబ్దుల్ కలాం విగ్రహానికి షబానా తో పాటు పాఠశాల ప్రధానోపాధ్యాయులు మునగాల చంద్రశేఖర్ రెడ్డి, ఉపాధ్యాయులు పూలమాలవేసి నివాళు లర్పించారు. అనంతరం అబ్దుల్ కలాం జీవిత విషయాలను విద్యార్థులకు బోధించి తల్లి తండ్రి లేని ఇద్దరు విద్యార్థులను షేక్ షబానా బిజెపి కృష్ణారావు చేరొక విద్యార్థిని దత్తత తీసుకొని వారి చదువులకు కావలసిన అవసరాలను తీరుస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా షేక్ షబానా మీడియాతో మాట్లాడుతూ పేద విద్యార్థులను దత్తత తీసుకోవడం ఎంతో ఆనందంగా ఉందని అన్నారు. అదేవిధంగా అబ్దుల్ కలాం అడుగుజాడలలో నడిచి విద్యార్థులు భావితరాలకు బాసటగా నిలవాలని విద్యార్థులకు సూచించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు ఉన్నారు.

సమ్మెకు నాయకత్వం వహిస్తే విధులనుండి తొలగిస్తారా

## మహాదేవయ్యను వెంటనే విధుల్లోకి తీసుకోవాలి

### హెడ్ పోస్ట్ ఆఫీస్ ఎదుట ఆల్ ఇండియా పోస్టల్ ఎంప్లాయిస్ యూనియన్ ధర్నా



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, అక్టోబర్ 15)

సమ్మెకు న్యాయకత్వం వహిస్తే విధులు నుండి తొలగించడం దారుణమని, వెంటనే మహాదేవయ్య ను విధుల్లోకి తీసుకోవాలని ఆల్ ఇండియా పోస్టల్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం హెడ్ పోస్ట్ ఆఫీస్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిడిఎస్ సమ్మెకు నాయకత్వం వహించినందుకు ఏఐజిడిఎస్యు ప్రధాన కార్యదర్శి ఎస్ ఎస్ మహదేవయ్యలు సేవ నుంచి తొలగించిన కేంద్ర ప్రభుత్వ చర్యను ప్రతి ఒక్కరు ఖండించాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని, లేనిపక్షంలో ఉద్యమాన్ని రాష్ట్రవ్యాప్తం చేస్తామని, ఢిల్లీలో నిరసన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా పోస్టల్ ఎంప్లాయిస్ యూనియన్ గ్రూప్ సి పోస్ట్ మాన్స్, ఎంటిఎస్, జిడిఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

## అంగరంగ వైభవంగా మాగుంట పుట్టినరోజు వేడుకలు











## కడప జిల్లాలో ఉక్కు పరిశ్రమ పై ప్రధానమంత్రి నరేంద్ర మోడీ స్పష్టత ఇవ్వాలి

### అవినీతి నిరోధక విభాగం రాష్ట్ర అధ్యక్షులు మోటపోతుల శివకుమార్



(షణ్ముఖ వెలుగు, బద్వేల్, అక్టోబర్ 15)

ప్రధానమంత్రి నరేంద్ర మోడీ రాయలసీమ ప్రాంతానికి 2019లో ఇచ్చిన హామీలు నేటికీ అమలు కాలేదని ప్రజా సంకల్ప వేదిక,అవినీతి నిరోధక విభాగం రాష్ట్ర అధ్యక్షులు మరియు కడప జిల్లా ఇన్చార్జ్, మోటపోతుల శివకుమార్ వ్యాఖ్యానించారు. ఈనెల 16వ తేదీన రాయలసీమ ప్రాంతంలోని కర్నూల్ లో పర్యటన సందర్భంగా వెనుకబడిన రాయలసీమ ప్రాంతానికి ఇచ్చిన హామీలు ఎప్పుడూ నెరవేరుస్తారో. రాయలసీమ ప్రాంతాన్ని ఎప్పుడు అభివృద్ధి చేస్తారో.. కర్నూల్ పర్యాటంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ స్పష్టత. ఇవ్వాలని రాయలసీమ ప్రాంత ప్రజలు ఎదురుచూస్తున్నారని ఆయన అన్నారు. కర్నూలు లో హైకోర్టు ఏర్పాటు చేయాలి. వెనుకబడిన రాయలసీమ కోసం నీటి ప్రాజెక్టులు, త్వరగా పూర్తి చేయాలి.ఏఐఎంఎస్. స్థాయి ఆరోగ్య సదుపాయాలు త్వరగా పరిష్కరించాలి. జాతీయ విద్యా సంస్థలు స్థానిక యువతకు ఉపాధి పరిశ్రమల ద్వారా ఉద్యోగ అవకాశాలు కల్పించాలి. వాల్మీకి బోయలకు ఎస్టీ హోదా అండ్ రేణిగుంట రైల్వే జోన్ కడప ఉక్కు పరిశ్రమ హామీలు ఎప్పుడూ అమలు చేస్తారో ఈ పర్యటనలో అయినా ప్రజలకు తెలియజేయాలని వారు కోరారు.

# నేటి నుంచి సూర్యలంక బీచ్ అభివృద్ధి పనులు ప్రారంభించాలి

## జిల్లా కలెక్టర్ వి వినోద్ కుమార్

(షణ్ముఖ వెలుగు, బాపట్ల, అక్టోబర్ 15)

స్వదేశీ దర్శన్-2.0 కింద సూర్యలంక బీచ్ అభివృద్ధి పనులు 16వ తేదీ నుంచి ప్రారంభించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ తెలిపారు. స్వదేశీ దర్శన్-2.0 అభివృద్ధి పనులపై అనుబంధశాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ బుధవారం వీక్షణ సమావేశం నిర్వహించారు. సూర్యలంక బీచ్ అభివృద్ధి చేయడానికి కేంద్ర ప్రభుత్వం స్వదేశీ దర్శన్-2.0 కింద రూ.97.52 కోట్లు నిధులను విడుదల చేసిందన్నారు. 3.5 ఎకరాల విస్తీర్ణంలో పర్యాటకుల సౌకర్యార్థం మౌలిక సదుపాయాలు కల్పిస్తారన్నారన్నారు. మరో రెండు ఎకరాల విస్తీర్ణంలో శాశ్వత దుకాణాల నిర్మాణం, వాహనాల పార్కింగ్ ఏర్పాటు చేయాలన్నారు. 1.5 కిలోమీటర్ల దూరం వరకు బోట్ ల ద్వారా కెనాల్లో పర్యటించేందుకు అభివృద్ధి చేయాలన్నారు. పర్యాటకులను మరింత ఆకర్షించేలా పరిసరాలు సుందరంగా తీర్చి దిద్దాలన్నారు. బీచ్ వద్ద మంచి మొక్కలు నాటాలని, పర్యాటకులకు ఆహ్లాదాన్ని కలిగించేలా నిర్మాణాలు జరగాలన్నారు. మరుగుదొడ్లు, స్నానపు గదులు, దుస్తులు మార్చుకోవడానికి ప్రత్యేకంగా గదులను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఆ ప్రాంతంలో శాశ్వతంగా దుకాణాలు నిర్మిస్తున్నామన్నారు. బీచ్ అభివృద్ధి పనులు 2026 సెప్టెంబర్ నాటికి పూర్తి చేయాలని సూచించారు. పనులు వేగంగా చేపట్టాలని సంబంధిత ఏజెన్సీ ప్రతినిధులకు ఆయన పలు సూచనలు చేశారు. బీచ్ వద్ద సురక్షితమైన తాగునీటి వనరులు లేనందున తాగునీటి సరఫరాకు చర్యలు తీసుకుంటామన్నారు. పనుల పురోగతిపై ఎప్పటికప్పుడు నివేదిక ఇవ్వాలన్నారు వాడరేవు-చిలకలూరిపేట జాతీయ రహదారి 167 ఏ నిర్మాణం సత్వరమే పూర్తి చేయాలని కలెక్టర్ చెప్పారు. 47 కిలోమీటర్ల పొడవునా నిర్మించే రహదారి బాపట్ల జిల్లాలోనే 35 కిలోమీటర్ల పొడవున వెళ్తుందన్నారు. ఎలాంటి ప్రమాదాలు జరగకుండా హెచ్చరిక బోర్డులు, తదితరమైన జాగ్రత్తలు పాటించాలన్నారు. ఇప్పటివరకు 92.38% రహదారి నిర్మాణం పూర్తి చేసినట్లు వివరించారు. నిర్మాణ పనులలో నాణ్యత ప్రమాణాలు పాటించాలన్నారు. నాణ్యత పరీక్షలు నిర్వహిస్తామని, నాణ్యత లోపిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. చీరాల వాడరేవు బీచ్ వద్ద జాతీయ రహదారి నిర్మాణం ముగుస్తున్నందున చిన్న పార్క్ ఏర్పాటు చేయాలన్నారు. పర్యాటకులకు సుందరంగా దర్శనమిచ్చేలా పార్క్ నిర్మాణం జరగాలన్నారు. జిల్లాలో వెళ్లే రహదారికి ఇరువైపులా 5,500 మొక్కలు నాటాలన్నారు. ప్రయాణ సమయంలో ప్రయాణికులకు ఆహ్లాదంగా అనుభూతి కలిగించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఆక్వా పార్క్ 192.42 ఎకరాలలో అభివృద్ధి చేయనున్నట్లు కలెక్టర్ చెప్పారు. సమీకృత ఆక్వా పార్క్ నిర్మాణం ద్వారా ఆక్వా రంగం మరింత అభివృద్ధి కానుందన్నారు. మత్స్యకారులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందన్నారు. వివిధ రకాల మత్స్య సంపద అభివృద్ధికి ఈ పార్క్ కేంద్ర బిందువు కానందన్నారు. ఈ నేపథ్యంలో జిల్లాకు రూ. 88.08 కోట్లు మంజూరయ్యాయన్నారు. జిల్లా అభివృద్ధిలోనూ ఆక్వా పార్క్ ప్రాధాన్యత సంతరించుకోనుందన్నారు. నిజాంపట్నం ఓడరేవు 60 శాతం నిర్మాణం పూర్తయిందన్నారు. ఈ సమావేశంలో పర్యాటక శాఖ అధికారి నాగిరెడ్డి, ఏజెన్సీ ప్రతినిధులు, ఎన్ హెచ్ ఎ అధికారులు, గుత్తేదారుడు దిగ్విజయ్ సింగ్, జిల్లా మత్స్య శాఖ అధికారి శ్రీనివాస్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.







## ముక్తి పథం భాగవతం

## ఆధ్యాత్మిక ఉపన్యాసకులు ఎం వి ఎస్ శాస్త్రి

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, అక్టోబర్ 15)

భగవంతుని దివ్య చరణారవిందాలను ఆశ్రయించి త్రికరణ శుద్ధితో అర్చించి సేవించి భగవద్దర్శన ప్రాప్తితో జీవితాన్ని తరింప చేసుకుని మోక్ష సామ్రాజ్యాన్ని కైవసం చేసుకున్న మహా భక్తాగ్రేసరులలో పోతనది అగ్రస్థానమని పోతన భాగవత పద్యాలు మకరంద సదృశాలని ఆధ్యాత్మిక ఉపన్యాసకులు భాగవత ప్రచార సేవా సమితి అధ్యక్షులు ఎం వి ఎస్ శాస్త్రి శాస్త్రి పేర్కొన్నారు.ఒంగోలు దక్షిణం బజారు లోని వేణు గోపాలస్వామి ఆలయంలో ఏర్పాటైన భాగవత కథా సుధా లహరి కార్యక్రమంలో ఎం వి ఎస్ శాస్త్రి పాల్గొని ప్రసంగించారు. వెయ్యేళ్ల తెలుగు సాహిత్య చరిత్రలో కవిత్రయంగా పేరొందిన నన్నయ తిక్కన ఎఱ్ఱనల తరువాత ప్రముఖంగా వినిపించే పేరు పేరు పోతనదేనని తెలిపారు. " ఖ్యాతి గడించుకున్న కవులందరు లేరె! అదేమి చిత్రమో, పోతన యన్నచో కరిగిపోవు నెడంద జోహారు సేతకై, చేతులు లేచు ఈ జన వశీకరణాద్భుత శక్తి చూడగా, అతని పేరులో గలదొ ఆయన గంటములోన నున్నదో " అంటూ కరుణశ్రీ గా.. అభినవ పోతనగా ప్రసిద్ధులైన జంధ్యాల పాపయ్య శాస్త్రి పోతనకు భక్తితో అంజలించారని కవి సమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ 'తెలుగుల పుణ్యపేటి' గా పోతనను అభివర్ణించారని వివరించారు. భక్తి అంటే ఇష్ట పూర్వకమైన భగవదారాధన అని భాగవతం భగవంతుని స్వరూపంగా పద్మ పురాణం అభివర్ణించిందని శాస్త్రి పేర్కొన్నారు. భాగవతం శ్రీ మహా విష్ణువు ప్రతిరూపం. మహానుభావుడైన ఆ శ్రీహరిని..

ఆయన లీలలను స్మరించడం పుణ్యాన్ని ప్రసాదిస్తుందన్నారు. భాగవత పఠనం..శ్రవణం కూడా ఆ శ్రీహరిని పూజించిన ఫలాన్ని కలుగ చేస్తుంది. తనను చేరుకునేందుకు భక్తి మార్గం ఒకటే ఆధారమని శ్రీకృష్ణుడు ఉద్ధవునికి స్పష్టం చేసాడని, మానవులే కాదు.. పశు పక్ష్యాదులు సైతం భగవంతుని కృపకు అర్హమైనవేనని సాలె పురుగు..ఏనుగు..పాము పరమేశ్వరుని అర్చించి తరించి మోక్షాన్ని పొందిన వైనాన్ని ధూర్జటి మహాకవి శ్రీ కాళ హస్తీశ్వర మాహాత్మ్యం కావ్యంలో తెలియ చెప్పాడని శాస్త్రి పేర్కొన్నారు. భాగవతంలో కూడా ప్రహ్లాదుడు.. ధ్రువుడు.. గజేంద్రుడు..అంబరీషుడు... నారదుడు..బలి చక్రవర్తి వంటి వారి గాథలు భక్తి మహిమను వెల్లడిస్తున్నాయని భగవంతుని చేరుకునేందుకు భక్తి ఒక సోపాన మార్గమని, భక్తి లేని వానికి భగవంతుని అనుగ్రహం కలుగదని శాస్త్రి స్పష్టం చేశారు. భగవంతుని ఆరాధించి తరించేందుకు నవ విధ భక్తి మార్గాల గురించి భాగవతం పేర్కొన్నదని వివరించారు. " శ్రవణం, కీర్తనం, విష్ణోః స్మరణం, పాద సేవనం, అర్చనం, వందనం, దాస్యం, సఖ్యం, ఆత్మ నివేదనమ్ " అనేవి నవ విధ భక్తి మార్గాలని శాస్త్రి తెలిపారు. పోతన మహాకవి రచించిన భాగవత కావ్యంలోని కథలను సరళ సుందరంగా తెలియ చెప్పిన ఎంవిఎస్ శాస్త్రిని వేణుగోపాల స్వామి దేవస్థానం నిర్వాహకులు, అర్చకులు శ్రీనివాసాచార్యులు, డాక్టర్ సంతవేలూరి కోటేశ్వరరావు తదితరులు ఘనంగా సత్కరించారు. దేవస్థానం నిర్వాహకులు భక్తులకు స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

# క్రమశిక్షణ జీవితానికి ఆరోగ్యంతోనే సాధ్యం

## కలెక్టరేట్‌లో గ్లోబల్ హ్యాండ్ వాష్ డే కార్యక్రమం ప్రారంభం






**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, అక్టోబర్ 15)**

ఒంగోలు కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ హాల్లో జరిగిన గ్లోబల్ హ్యాండ్ వాష్ డే కార్యక్రమాన్ని జిల్లా విద్యాశాఖ, విజయ వాణి చారిటబుల్ ఫౌండేషన్ సంయుక్తంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా విద్యాశాఖ అధికారి ఏ కిరణ్ కుమార్ అధ్యక్ష వహించారు. చేతులను శుభ్రంగా కడుక్కోవడం ద్వారా జీవితంలో నిజమైన హీరోలుగా మిగిలిపోతారని అన్నారు. ఆరోగ్యం ఆనందం అభివృద్ధి అనేది పరిసర పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత కూడా కలిగి ఉండడం ద్వారా మాత్రమే సాధ్యమవుతుందని తెలియజేశారు. కనెక్షన్ క్రమశిక్షణతో జీవితాన్ని ముందుకు నడిపించాలి అంటే ఆరోగ్యంతో మాత్రమే సాధ్యమవుతుందని అన్నారు. విద్యార్థులు ప్రజలు చైతన్యవంతులై సమాజానికి అవసరమైన విద్యను వివేకాన్ని అందించాలని పిలుపునిచ్చారు. జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ చేతులు శుభ్రంగా కడుక్కోవడం ద్వారా డి వార్మింగ్ టాబ్లెట్లు వేసుకోవాల్సిన అవసరం రాదు అన్నారు. అంతే కాకుండా డబ్ల్యూహెచ్ఓ సూచించిన విధంగా ఏడు రకాలుగా చేతులను శుభ్రంగా కడుకోవాలని భోజనానికి ముందు తర్వాత మరుగుదొడ్లు వాడిన తర్వాత అనారోగ్యంతో బాధపడుతున్న వారికి సేవలు చేసిన తర్వాత తప్పనిసరిగా చేతులను శుభ్రం చేసుకోవాలని పిలుపునిచ్చారు. మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీహరి మాట్లాడుతూ మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉంది అని గ్లోబల్ హ్యాండ్ వాష్ డే ప్రాధాన్యతను వివరించారు. ఈ సందర్భంగా డాక్టర్ వీరభద్రుడు రాష్ట్ర ప్రోగ్రాం ఆఫీసర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పరిసరా శుభాకాంక్షలు వ్యక్తిగత శుభ్రతను కూడా పాటించాలని అందులో భాగంగా భోజనానికి ముందుగా తరువాత సూచించిన ప్రకారం ఏడు మార్గాల ద్వారా చేతులు శుభ్రంగా కడుకోవాలని తెలియజేశారు. ముఖ్యమైన ఏడు సందర్భాలలో చేతులను కడుక్కోవడం అలవాటుగా చేసుకోవాలని తెలియజేశారు అందరూ భాగంగా దగ్గు లేదా తుమ్ము ల తర్వాత అనారోగ్య వ్యక్తికి సేవలు చేసే ముందు తర్వాత కలుషితమైన వివిధ ఉపరతలాలను తాకినప్పుడు బయటకు వెళ్లి ఇంటికి తిరిగి వచ్చిన తర్వాత ఆహారాన్ని తయారు చేసే ముందు తినడానికి ముందు మరుగుదొడ్డిని ఉపయోగించిన తరువాత మరియు చెత్త మరియు వ్యర్థాలను పారవేసిన తరువాత వంట కార్యక్రమాలను నిర్వహించడానికి ముందుగా తప్పనిసరిగా చేతులను శుభ్రం చేసుకోవడం ద్వారా సురక్షితమైన జీవితాన్ని పొందవచ్చు అని తెలియజేశారు. ఈ సందర్భంగా చేతులను శుభ్రంగా కడుక్కునే పద్ధతులను విద్యార్థులతో చేసి చూపించారు. కార్యక్రమానికి ముందుగా గ్లోబల్ హ్యాండ్ వాషింగ్ డే సందర్భంగా నిజ జీవితంలో అందరూ హీరోలుగా ఉండాలని అందుకు 60 రోజులు క్రమం తప్పకుండా చేతులను శుభ్రం చేసుకోవాలి అని ఇది ఒక అలవాటుగా కొనసాగించాలని జిల్లా విద్యాశాఖ అధికారి పిలుపునిచ్చారు. కళాజాత కార్యక్రమము ద్వారా పాటలు మరియు నాటకం రూపంలో ఆహుతులను అలరించారు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సెల్ఫీ స్టాండ్ లో హాజరైన విద్యార్థులు మహిళలు పోటీలు పడి సెల్ఫీలు తీసుకొని వాటిని వాట్సప్ గ్రూపులలో తమ స్నేహితులకు బంధువులకు పంపడం ప్రత్యేకతగా నిలిచిందన్నారు. విజయ వాహిని చారిటబుల్ ఫౌండేషన్ రాష్ట్ర ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ వీరభద్రుడు మాట్లాడుతూ, చేతులు శుభ్రంగా కడుక్కోవడం అనేది దాని యొక్క ప్రాముఖ్యతను కరోనా సమయంలో ప్రజలందరికీ స్వీయ అనుభవం అన్నారు ఆరోగ్యం మన చేతుల్లోనే ఉంది చేతులు శుభ్రంగా ఉంటే ఆరోగ్యం ఆనందం ఉంటుందని అన్నారు. స్టెప్ , యూత్ స్పోర్ట్స్ జిల్లా అధికారి శ్రీమన్నారాయణ మాట్లాడుతూ, యువత ఆరోగ్యం మీ చేతుల్లోనే ఉంటుందని సెల్ఫీ స్టాండ్ లో చూపించిన విధంగా 9 రకాల పనులు చేసిన తర్వాత ముందు తప్పనిసరిగా చేతులు శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉమన్ చైల్డ్ డిపార్ట్మెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ సువర్ణ , విజయ వాహిని చారిటబుల్ ఫౌండేషన్ జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ టి రంగారావు, వాష్ జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్ ఎం శ్రీనివాసరావు, ప్రోగ్రాం ప్రతినిధి కె మరియుబాబు, తదితరులు పాల్గొన్నారు.

# ఏపీ బీజేపీ రాష్ట్ర మీడియా ప్రతినిధిగా డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి



**(షణ్ముఖ వెలుగు, మార్కాపురం ఇన్‌ఛార్జి, అక్టోబర్ 15)**

ఆంధ్రప్రదేశ్ భారతీయ జనతా పార్టీ రాష్ట్ర మీడియా ప్యానలిస్టుల జాబితాను బుధవారం సాయంత్రం ఆ పార్టీ విడుదల చేసింది. రాష్ట్రవ్యాప్తంగా 19 మంది నాయకులకు ఈ జాబితాలో చోటు దక్కింది. ప్రకాశం జిల్లా నుంచి డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి ఈ జాబితాలో స్థానం పొందడం విశేషం. ఈ సందర్భంగా స్పందించిన డాక్టర్ ఏలూరి “ఈ అవకాశం కల్పించిన రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్‌కి హృదయపూర్వక ధన్యవాదాలు. పార్టీ నాపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకునేలా కృషి చేస్తాను. బీజేపీ సిద్ధాంతాలు, ప్రజా ప్రయోజనాలు ప్రతీ వేదికలో గళమెత్తి వినిపిస్తాను” అని పేర్కొన్నారు. ఉమ్మడి ప్రకాశం జిల్లా యర్రగొండపాలెం నియోజకవర్గం పెద్దారవీడు మండలం, గొబ్బూరు గ్రామానికి చెందిన ఏలూరి రామచంద్రారెడ్డి మార్కాపురం అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా, అలాగే పశ్చిమ రాయలసీమ శాసన మండలి నియోజకవర్గం నుంచి ఎమ్మెల్సీగా పోటీ చేశారు. గతంలో కాంగ్రెస్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీల్లో కూడా కీలక భూమిక పోషించారు. అయితే జాతీయవాద భావజాలంతో మెలిగే ఆయన ఆ పార్టీల వ్యవహారశైలి నచ్చక దేశం కోసం ధర్మం కోసం పనిచేయాలన్న సంకల్పంతో 2024 సార్వత్రిక ఎన్నికలకు ముందు బీజేపీలో చేరారు. విద్యార్థి దశనుంచే రాజకీయాల్లో చురుకుగా పాల్గొన్నారు.. విద్యార్థి సమయంలో ఏబీవీపిలో పనిచేశారు. స్పష్టమైన వాగ్ధాటి, విశ్లేషణా సామర్థ్యం కలిగిన నేతగా ప్రసిద్ధి చెందిన ఏలూరి, వివిధ టీవీ చర్చల్లో బీజేపీ వాయిస్‌ను బలంగా వినిపిస్తారన్న నమ్మకంతో పార్టీ అధిష్టానం ఈ బాధ్యతను అప్పగించినట్లు తెలుస్తోంది. ఇదిలావుంటే రాజకీయంగా, మేధోపరంగా బలమైన నాయకుడిగా గుర్తింపు పొందిన డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి, పార్టీ భవిష్యత్తు వ్యూహాత్మక ఆలోచనల్లో కూడా కీలక పాత్ర పోషించే అవకాశం ఉన్నట్లు పార్టీ వర్గాలు పేర్కొన్నాయి. ఇక ఆయనకు ఈ పదవి దక్కడంతో అనుచరగణం సంబరాల్లో మునిగితేలుతున్నారు.

# జగన్నాధపురం మండల ప్రాథమిక పాఠశాలలో ఘనంగా అబ్దుల్ కలాం జయంతి




**(షణ్ముఖ వెలుగు, తర్లుపాడు, అక్టోబర్ 15)**

మండలంలోని జగన్నాధపురం గ్రామంలోని మండల ప్రాథమిక పాఠశాలలో మాజీ రాష్ట్రపతి స్వర్గీయ అబ్దుల్ కలాం జయంతి వేడుకలు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కసెట్టి వెంకట జగన్ బాబు ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మండల విద్యా శాఖ అధికారిని దేవరకొండ సుజాత హాజరయ్యారు. ముందుగా అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా విద్యాశాఖ అధికారిని సుజాత, ప్రధానోపాధ్యాయుడు వెంకట జగన్ బాబులు కలిసి సంయుక్తంగా మాట్లాడుతూ అబ్దుల్ కలాం భారతదేశానికి 11వ రాష్ట్రపతిగా పనిచేశారన్నారు. ఈయన అసలు పేరు ఆవుల పకీర్ జైనలుబ్ధి న్ కలాం, ఈయన అక్టోబర్ 15, 1931వ సంవత్సరంలోతమిళనాడురాష్ట్రంలోని, రామేశ్వరంలో ఒకసామాన్య కుటుంబానికి చెందిన జలాల్, ఆశియా దంపతులకు జన్మించి, రామేశ్వరంలోనే ప్రాథమిక విద్య పూర్తిచేశాడన్నారు .ఈయనఉన్నతచదువులకోసంతిరుచురాపల్లిలోని సెయింట్ జోసెప్ కళాశాలలో భౌతిక శాస్త్రాన్ని అభ్యసించి, అనంతరం చెన్నైలోని మద్రాస్ ఇన్స్టిట్యూట్ ఆఫ్టెక్నాలజీ కళాశాలలో ఏరోసిస్ ఇంజనీరింగ్ లో పట్టా పొంద్యాడన్నారు.భారత రాష్ట్రపతికాకముందురక్షణపరిశోధన సంస్థలో ఏరోసిస్ ఇంజనీరింగ్‌గా పనిచేశాడన్నారు. ఈ క్రమంలో ఆయన భారతదేశపు మిస్సైల్ మెన్‌గా పేరుపొందాడున్నారు. ఈయన ముఖ్యంగా బాలిస్టిక్ క్షిపణి ప్రయోగ వాహన సాంకేతికత అభివృద్ధికి కృషి చేశాడన్నారు. 1998లో భారత దేశ పోక్రాన్ టు అణు పరీక్షలోకీలకమైన సాంకేతికతతో పాటు రాజకీయ పాత్రను కూడా పోషించాడన్నారు. అంతేకాక 1960లో కలాం డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్మెంట్ ఎస్టాబ్లిష్మెంట్ లో శాస్త్రవేత్తగా చేరా డ న్నారు. అబ్దుల్ కలాం భారత దేశ సైన్యం కోసం ఒక హెలికాప్టర్ ను కూడా తయారు చేశారన్నారు. 1969లో భారతఅంతరిక్షపరిశోధనసంస్థలో చేరి ఇస్రో మొట్టమొదటి స్వదేశీ ఉపగ్రహ ప్రయోగ వాహనం తయారీలోపనిచేశాడన్నారు. 1980సంవత్సరంలో ఈ వాహనం రోహిణి ఉపగ్రహాన్ని భూమి దగ్గర కక్షలో విజయవంతం చేసిందన్నారు. 1992నుండి1999వరకు ప్రధానమంత్రికి శాస్త్రీయ సలహాదారుడిగా, డి ఆర్ డి ఓ ముఖ్య కార్యదర్శిగా పనిచేశాడన్నారు. అబ్దుల్ కలాం 2002 నుండి 2007 వరకు వరకు భారత రాష్ట్రపతిగా ప్రజలకు తన అద్భుతమైనసేవలనుఅందించాడన్నారు.భారతరత్నఅవార్డుపొందిన వారిలో ఈయన మూడో వ్యక్తి అన్నారు. ఈయన 2015లోషిల్లాంగ్ లోని ఐ ఐ ఎంఓలోని విద్యార్థుల నుఉద్దేశించి ప్రసంగిస్తూ హఠాత్తుగా కుప్పకూలి పడిపోవడం జరిగింది. ఈ సంఘటన జరిగిన 45నిమిషాలకే ఆయన మృతి చెందడం జరిగిందన్నారు. కలాం జీవితచరిత్రగురించి, ఆయన దేశానికి చేసిన సేవలు గురించి నేటి బాలలే రేపటి పౌరులుగా పరిణతి చెందుతున్న విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయిని అనూష, విద్యార్థులు పాల్గొన్నారు.

# పేద, బడుగు వర్గాల ఆశాజ్యోతి ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి



**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, అక్టోబర్ 15)**

నిగర్వి, స్నేహశీలి, పేద బడుగు వర్గాల ఆశాజ్యోతి, ప్రకాశం జిల్లా తాగునీటి, విద్యా అభివృద్ధి ప్రదాత ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డికి జనసేన నాయకులు వెలుగోలు కాశీ విశ్వనాథ్ బుధవారం ఆయన నివాసంలో కలిసి బొకే అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

# కీటక జనితా వ్యాధుల పై అవగాహన



**(షణ్ముఖ వెలుగు, బద్వేల్, అక్టోబర్ 15)**

ఒంటిమిట్ట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని నర్వకాటిపల్లి సచివాలయం నందు కీటక జనిత వ్యాధుల గురించి గ్రామ ప్రజలకు అవగాహన సదస్సు ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ అధికారి ఇండ్ల సుబ్బరాయుడు మాట్లాడుతు దోమ పుట్టకూడదు, పుట్టిన దోమ మానవుని కుట్టకూడదు అని తెలియపరిచారు. ప్రతి వ్యక్తి ప్రతి కుటుంబం పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని తెలియపరిచారు. సిహెచ్ఓ టి హవిలా సిపిఆర్ గురించి ప్రజలకు అవగాహన సదస్సు ఏర్పాటు చేయడం జరిగింది. సూపర్వైజర్ భాస్కర్‌రెడ్డి ఎంపీపీ స్కూల్ నందు చేతుల పరిశుభ్రత గురించి పిల్లలకు తెలియజేయడం జరిగింది. అలాగే మద్యాన్న భోజనం పథకాన్ని తనిఖీ చేయడం జరిగినది.ఈ కార్యక్రమంలో ఆశా కార్యకర్త జి వనిత, ఉపాధ్యాయుల బృందం పాల్గొన్నారు.

# లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరం



**(షణ్ముఖ వెలుగు, బద్వేల్, అక్టోబర్ 15)**

లింగ నిర్ధారణ చేయించడం చట్టరీత్యా నేరమని డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేట్ అధికారి బి వెంగయ్య అన్నారు. మండలంలోని అనంతరాజపురంలో బుధవారం విలేజ్ హెల్త్ క్లినిక్లోమరియు ప్రాథమిక ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ బాలికల దినోత్సవం కార్యక్రమం గ్లోబల్ హ్యాండ్ వాష్ డే సి ఆర్ పి అవగాహన కార్యక్రమం జరిగింది . వ్యక్తి స్పృహ కోల్పోతే ఏ విధంగా రక్షించాలో సిహెచ్ఓ శిరీష డెమోన్స్ట్రేషన్ చేసి చూపించడం జరిగింది. ఈ వృత్తిని అంకితభావంతో పని చేస్తామని విద్యార్థినీ విద్యార్థుల చేత ప్రమాణం చేయించడం జరిగింది. ఈ సందర్భంగా హెల్త్ ఎడ్యుకేటర్ అధికారి మాట్లాడుతూ స్కానింగ్ సెంటర్లలో లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరమన్నారు. ప్రతి బిడ్డకు వ్యాధి నిరోధక టీకాలు వేయించాలన్నారు. హెల్త్ అసిస్టెంట్లు వీరి జనార్ధన్‌రావు, రామయ్యలు మాట్లాడుతూ పరిసరాలను శుబ్రంగా పెట్టుకోవాలన్నారు. లార్వా ను నిరోధించడం వలన దోమను అరికట్ట వచ్చున్నారు. ప్రతి రోజు లార్వా పై ఇంటింటి సర్వే చేస్తున్నామన్నారు. వారికి శుభ్రతపై అవగాహన కల్పిస్తూ జ్వరాలు రాకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. అబెట్, బ్లీచింగ్ చల్లిస్తూ నిల్వ ఉన్న నీటిలో ఆయిల్ బాల్స్ వేస్తున్నామన్నారు పాఠశాలలో విద్యార్థులకు పెట్టే భోజనాలను పరిశీలించి శుభ్రత పై సిబ్బందికి అవగాహన కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది రామ్మోహన్, మౌనిక లక్ష్మీనారాయణమ్మ, ఉపాధ్యాయులు, ఆశాలు పాల్గొన్నారు.

# ఘనంగా అబ్దుల్ కలాం జయంతి



**(షణ్ముఖ వెలుగు, బద్వేల్, అక్టోబర్ 15)**

భారతరత్న భారతదేశ మాజీ రాష్ట్రపతి పీజే అబ్దుల్ కలాం 94 జయంతి కార్యక్రమం బద్వేల్ పట్టణంలోని విశ్రాంత ఉద్యోగుల సంఘం కార్యాలయంలో అధ్యక్షులు రామసుబ్బారెడ్డి ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1931 సంవత్సరం సెప్టెంబరు 15న తమిళనాడు రాష్ట్రంలోని రామేశ్వరం గ్రామంలో పుట్టి పేదరికం అనుభవించి రాష్ట్రపతి స్థాయికి ఎదిగిన మహనీయుడని అన్నారు. అబ్దుల్ కలాం చేసిన సేవలకు భారత ప్రభుత్వం అవార్డు ఇచ్చి సన్మానించిందన్నారు. ముఖ్యంగా గుండె జబ్బుల నివారణకు స్టంటు కనిపెట్టిన మహనీయుడని అన్నారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షులు రామసుబ్బారెడ్డి, కార్యదర్శి కత్తి బ్రహ్మయ్య, కోశాధికారి గంగన్న, ఆర్గనైజేషన్ కార్యదర్శి ముల్లపాటి పిచ్చయ్య, ఉపాధ్యక్షులు రాఘవరెడ్డి, అసోసియేట్ అధ్యక్షులు గంజికుంట, పుల్లయ్య, ఆనందరావు, రామసుబ్బయ్య, వెంకటేశ్వర్లు ప్రసాద్, సుబ్బరాయుడు, రామసుబ్బయ్య, తదితరులు పాల్గొన్నారు. అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాలు వేసి ఘనంగా నివాళు లర్పించారు.

## మీ ఆరోగ్యం మీ చేతుల్లోనే
## జిల్లా వైద్యాధికారిణి విజయమ్మ




(షణ్ముఖ వెలుగు, బాపట్ల, అక్టోబర్ 15)
జిల్లా వైద్యశాఖ ఆధ్వర్యంలో డాక్టర్స్ ఎ ఎన్ యమ్స్, ఆషా వర్కర్స్ బాపట్ల మున్సిపల్ హై స్కూల్ బాల బాలికలు స్కూల్ వద్ద నుండి పాత బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్యాధికారిణి విజయమ్మ మాట్లాడుతూ...గ్లోబల్ హ్యాండ్ వాషింగ్ డే పురస్కరించుకొని ర్యాలీ నిర్వహించడం జరిగిందని అన్నారు. ప్రతి ఒక్కరూ భోజనం చేసే ముందు చేతులు కడుకోవాలని మన చేతులను శుభ్రంగా ఉంచుకోవాలని చేతులు కడుక్కోకుండా ఆహారం సేవిస్తే రోగాల బారిన పడే అవకాశం ఉందని అన్నారు. అపరిశుభ్రమైన చేతుల ఆరోగ్యానికి హానికరం చేస్తాయని స్వచ్ఛమైన చేతులు ఎక్కడ ఉంటాయో అక్కడ ఆరోగ్యం ఉంటుందని అన్నారు. చేతులను కడిగి పెట్టుకుని రోగాలను తరిమికొట్టాలని భోజనానికి ముందు మలవిసర్జన తర్వాత చేతులు శుభ్రత తప్పనిసరి అని కాబట్టి ప్రతి ఒక్కరూ ఆహారం తీసుకునే ముందు చేతులు శుభ్రంగా కడుక్కొని ఆరోగ్యంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఈఓ డిఎంహెచ్వో, ఎంఈఓ, డాక్టర్, ఏఎన్ఎమ్స్, ఆశ వర్కర్స్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

## జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో
## గ్లోబల్ హ్యాండ్ వాషింగ్ డే కార్యక్రమాలు







(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, అక్టోబర్ 15)
ప్రపంచ చేతులు కడుక్కునే దినోత్సవం సందర్భంగా జన విజ్ఞాన వేదిక ప్రకాశం జిల్లా శాఖ ఆధ్వర్యంలో కనిగిరి పట్టణంలో యం.పి.పి.యస్ ఉర్దూ పాఠశాల 8, 9వ వార్డు సచివాలయాల్లో అంగన్‌వాడీ కేంద్రాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమాలలో జన విజ్ఞాన వేదిక జాతీయ ఉపాధ్యక్షులు షేక్ గయాజ్ భాష, ప్రకాశం జిల్లా ప్రధాన కార్యదర్శి డా!! కె టి సి పాపారాయుడు పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చేతులు పరిశుభ్రంగా కడుక్కోవడం ద్వారా డయేరియా, టైఫాయిడ్, వైరల్ ఇన్ఫెక్షన్లు, కోవిడ్-19 వంటి అనేక వ్యాధులను నివారించవచ్చని తెలిపారు. భోజనం చేయడానికి ముందు, మరుగుదొడ్డికి వెళ్లిన తర్వాత, బయట నుంచి వచ్చినప్పుడు సబ్బుతో కనీసం 20 సెకండ్లు చేతులు కడుక్కోవాలని సూచించారు. విద్యార్థులు చేతులు కడుక్కోవడం పై డెమో కార్యక్రమాలు, పోస్టర్లు, నినాదాలు, నిర్వహించారు. చిన్నారుల్లో పరిశుభ్రతపై చైతన్యం పెంపొందించేందుకు అంగన్వాడీ కేంద్రాల్లో ప్రత్యేక అవగాహన సమావేశాలు చేపట్టారు. "శుభ్రమైన చేతులు -ఆరోగ్యమైన జీవితం" అనే నినాదంతో ప్రతి ఇంటిలోనూ, ప్రతి పాఠశాలలోనూ పరిశుభ్రత సంస్కృతిని అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్య క్రమంలో జన విజ్ఞాన వేదిక సభ్యులు మరియు కనిగిరి గ్రంథ పాలకుడు షేక్ షరీఫ్, ఉర్దూ పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి. జైనాభి, అంగన్వాడి సూపర్వైజర్ కె.సుమతి, మహిళా పోలీస్ పి మల్లీశ్వరి, ఏ. యన్.యం బి. గౌస్ బీ, అంగన్వాడి లు పి. అను రాధ, షేక్. రిజ్వాన, ఆశావర్కర్‌లు బి. ద్వారక మరియు షేక్ రెహానా, విద్యార్థినీ విద్యార్థులు, తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

## సిపీఆర్ చేయు విధానం
## గురించి మెడికల్ క్యాంపు




(షణ్ముఖ వెలుగు, మార్కాపురం ఇన్‌ఛార్జి, అక్టోబర్ 15) ప్రభుత్వ హోమియో వైద్యశాల, మార్కాపురం, వైద్యాధికారి డాక్టర్ ఆర్ సైదు బాషా మార్కాపురం ఎస్‌వీకేపీ డిగ్రీ కళాశాల నందు సిపీఆర్ చేయు విధానము, దాని యొక్క ప్రాముఖ్యత గురించి కళాశాల విద్యార్థులు, సిబ్బందికి కూలంకషంగా వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఇంచార్జి ప్రిన్సిపాల్ నాసరయ్య, సూపరింటెండెంట్ చల్ల రవికుమార్, కంప్యూటర్ లెక్చరర్ నారాయణ, కామర్స్ లెక్చరర్ రామాంజనేయులు, వైద్యశాల సిబ్బంది లక్ష్మీ నారాయణ, రంగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులారా... మత్తు పదార్థాలు మానండి
# మీ భవిష్యత్ కు బంగారు బాటలు వేసుకోండి

### కన్న వారి కన్న కలలను నేరవేర్చండి అనే నినాదంతో
### ముందుకు సాగుతున్న ప్రకాశం పోలీసులు

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, అక్టోబర్ 15)
ప్రకాశం జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్ రాజు ఆదేశాలతో జిల్లా వ్యాప్తంగా కళాశాలలు, పాఠశాల తోపాటు ప్రధానమైన కూడలిలో యువకలతో పాటు విద్యార్థులకు స్పెషల్ డ్రైవ్ లో భాగంగా మత్తు పదార్థాల పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు జిల్లా పోలీసు సిబ్బంది. మీ తల్లిదండ్రులు ఎంతో శ్రమించి ఆర్థికంగా ఇబ్బందులు ఉన్నప్పటికీ... పిల్లలు చదువుకుంటే వారి భవిష్యత్ బంగారు బాట అవుతుందని, కష్టపడి డబ్బులు పంపుతున్నారని విద్యార్థులకు పోలీసు సిబ్బంది గుర్తు చేశారు. మనం కాలేజీకు ఎందుకు వచ్చామని... కాలేజీకు వెళ్ళే ముందు ప్రతి ఒక్క విద్యార్థి ప్రతి రోజు ఒక్క క్షణం అలోచిస్తే... మీ లక్ష్యం మీ ముందు కనిపిస్తోందని గుర్తు చేశారు. అలా అలోచన చేసినప్పుడే... మీ లక్ష్యాలు మీకు కనిపిస్తాయని...అటు వైపు అడుగులు వేస్తారని విద్యార్థులకు తెలిపారు. అంతేగాక నిద్రలేవగానే... మిమ్ములను కన్న తల్లిదండ్రులను గుర్తు చేసుకొవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అలా గుర్తు చేసుకున్నప్పుడు... వారి నడకలు, వారి అలోచనలు మంచివైపు ప్రయణిస్తాయని విద్యార్థులకు గుర్తు చేశారు. అంతేగాక వారి తల్లిదండ్రులు మాటలు విని చదువుకుంటే... వారి కన్న కలలను నెరవేర్చే వైపు అడుగులు వేస్తారన్నారు. మీ తల్లిదండ్రులు చెప్పన మాట ప్రకారం చదువుకుంటే..జిల్లా, రాష్ట్రం, దేశం గర్వించదగ్గ పౌరులుగా మిగిలిన పోతారన్నారు. అదేవిధంగా సైబర్ నేరాలు, ఈ టీజింగ్, చట్టాలపై అవగాహన కల్పించాలన్నారు. ఇదిలా ఉంటే.. ఈ మధ్య కాలంలో కొందరు స్వార్ధ ప్రయోజనాల కోసం కాలేజిలు వద్ద డబ్బు కోసం విద్యార్థులకు మత్తు పదార్థాలు విక్రయిస్తున్నార విద్యార్థులకు గుర్తు చేశారు. అలాంటి వాటికి అలవాటు పడి మీ బంగారు భవిష్యత్ నాశనం చేసుకొవద్దని పోలీసు సిబ్బంది విద్యార్థులకు సూచించారు. ఎప్పుడూ విద్యార్థులు వారి లక్ష్యం వైపు ప్రయణించాలి... కాని చేడు వ్యసనాలు వైపు కన్నెత్తి చూడ కూడదని.. విద్యార్థులకు విజ్ఞప్తి చేశారు. మీ తోటి విద్యార్థులు చేడు వ్యసనాలకు బానిసలు అవుతుంటే... మనకేందుకులే అని ఎవరు అనుకోవద్దన్నారు. అలా ప్రతి ఒక్కరూ అనుకుంటే... మీరు కూడా అందులో భాగస్వామ్యులు అవుతారన్నారు. చేడు వ్యసనాలకు బానిసలుగా మారుతున్న వారిని... మంచి మార్గంలో పెట్టాల్సిన భాద్యత ప్రతి ఒక్కరిపైన ఉందని విద్యార్థులకు గుర్తు చేశారు. కాలేజిలు వద్ద కాని స్కూల్స్ వద్ద కాని విద్యార్థులు భవిష్యత్ నాశనం చేస్తున్న మత్తు పానీయాలు కాని, మత్తుపదార్థాలు కాని విక్రయిస్తే.. వేంటనే స్థానికంగా ఉన్న పోలీస్ స్టేషన్ లో కాని లేకపోతే.. డయల్ 112 కు కాని ఫోన్ చేసి పోలీసు వారికి సమాచారం ఇవ్వాలన్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు అత్యంత గోప్యంగా ఉంచామని ప్రజలకు, విద్యార్థులకు తెలియజేశారు. డబ్బు కోసం మత్తు పదార్థాలు విక్రయిస్తున్న ప్రతి ఒక్కరూ... మత్తు పదార్థాలు సేవించే వారిలో మీ బిడ్డలు ఉంటే ఎలా ఉంటుందో ఒక్కసారి అలోచించాలన్నారు. డబ్బు కోసం విద్యార్థి జీవితాలను








## శ్రీ సరస్వతి శిశు మందిరంలో
## ఘనంగా అబ్దుల్ కలాం జయంతి

### విద్యార్థులకు విద్యా సామాగ్రి అందజేసిన సుబ్బరాయుడు
### గురు కాపీ కేఫ్ సుబ్బరాయుడుకు గణ సన్మానం







(షణ్ముఖ వెలుగు, బద్వేలు, అక్టోబర్ 15)
భారత మాజీ రాష్ట్రపతి, భారతరత్న అవార్డు గ్రహీత ఏపీజే అబ్దుల్‌కలాం జయంతి వేడుకలు బద్వేలు పట్టణంలోని పోరుమామిల్ల రోడ్డులోని శ్రీ సరస్వతి శిశు మందిరంలో బుధవారం ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమం సరస్వతి శిశు మందిరం సెక్రటరీ పెద్ది సుధాకర్ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది,ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సరస్వతి శిశు మందిరం గౌరవ అధ్యక్షులు కె,వి సుబ్బారావు,దద్ధం వెంకటేశ్వర్లు (డి,వి) కొండపల్లి సుభాష్,ఆవుల చిన్ని వల్లం కొండు వెంకటరమణ తో పాటు పలువురు శిశు మందిరం వారి ఆధ్వర్యంలో నిర్వహించారు, అనంతరం పలువురు మాట్లాడుతూ భారత మాజీ రాష్ట్రపతి, భారతరత్న అవార్డు గ్రహీత 91,వ జయంతిని పురస్కరించుకుని కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమిళనాడు రాష్ట్రంలో ఒక నిరుపేద కుటుంబంలో జన్మించిన అబ్దుల్‌కలాం భారత అణురంగంలో అత్యున్నతస్థాయికి చేరి అనేక సేవలు అందించిన గొప్ప శాస్త్రవేత్త అని అన్నారు. అలాగే ఆయన రాష్ట్రపతిగా దేశానికి సేవలు చిరస్మరణీయమని అన్నారు. నేటి యువత ప్రతి ఒక్కరు డాక్టర్ అబ్దుల్ కలాం గారిని ఆదర్శంగా తీసుకొని వారి అడుగుజాడల్లో నడిచి వారికి ఆదర్శంగా నిలవాలన్నారు,డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా గురు కాఫీ కేఫ్ యజమాని రాచకొండు సుబ్బరాయుడు యాదవ్ ఆధ్వర్యంలో సుమారు 20 కిలోల కేకును కట్ చేసి పలువురు చిన్నారులకు తినిపించారు, అనంతరం విద్యార్థులకు స్వీట్స్, తినుబండారాలను వారి చేతుల మీదుగా అందజేశారు, అలాగే విద్యార్థులకు పలకలు బలపాలు, పెన్నులు ఎగ్జామ్ ప్యాడ్స్ నోట్ బుక్స్ తో పాటు పలు రకాల విద్యా సామాగ్రిని సుబ్బరాయుడు చేతుల మీదుగా అందజేశారు, ఇ%శీ%దుకు సహకరించిన సుబ్బరాయుడును శాలువాతో పలువురు సత్కరించి వారిని అభినందించారు,ఈ కార్యక్రమంలో ఏపీయూ జెడబ్ల్యూజే యూనియన్ అధ్యక్షులు భూమిరెడ్డి వెంకటేష్, మాజీ మార్కెట్ యార్డ్ డైరెక్టర్ పబ్బతి చంద్రశేఖర్, ఈగ సుబ్బారెడ్డి, కాంట్రాక్టర్ వెలవర్తి సుబ్బారెడ్డి, బిజెపి పట్టణ అధ్యక్షులు ధర్మిశెట్టి వెంకటసుబ్బయ్య, బ్రహ్మదేవుని యర్రంరెడ్డి, బిజెపి నాయకులు సుధాకర్, స్వప్న వైన్ షాప్ రవిశంకర్, నరసింహులు యాదవ్, చిన్న, పత్తి పుష్పలత, పలువురు పాఠశాల ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులతో పాటు పలువురు పాల్గొన్నారు.

## సంస్కృతి, సంప్రదాయాలు
## తెలిసేలా చర్యలు
## తీసుకోవాలి

### జిల్లా కలెక్టర్ పి రాజాబాబు





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, అక్టోబర్ 15)
జిల్లాలోని దేవాలయాల అభివృద్ధితో పాటు ఆ దేవాలయాల ప్రాశస్త్యం, చరిత్ర, సంస్కృతి, సంప్రదాయాలు, జాతర్లు, ఉత్సవాలు గురించి ప్రజలకు తెలిసేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి రాజాబాబు, దేవాదాయ శాఖ అధికారులను ఆదేశించారు. బుధవారం ఉదయం కలెక్టరెట్లోని తన ఛాంబర్‌లో జిల్లా కలెక్టర్ రాజాబాబు దేవాదాయ శాఖ అధికారులతో సమావేశమై ఆ శాఖ ద్వారా అమలు చేస్తున్న కార్యక్రమాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా దేవాదాయ శాఖ ద్వారా చేపడుతున్న కార్యక్రమాలపై అసిస్టెంట్ కమీషనర్, జిల్లా కలెక్టర్ కు వివరిస్తూ జిల్లాలో దేవాదాయ శాఖ పరిధిలో మొత్తం 1,001 దేవాలయాలు, సత్రాలు వున్నాయని, అందులో 12 పురాతన, చారిత్రక దేవాలయాలు ఉన్నాయని, 38,866.95 ఎకరాల భూమి దేవాదాయ శాఖ పరిధిలో ఉందని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలోని దేవాలయాల అభివృద్ధికి సమగ్ర ప్రణాళిక రుపొందించాలన్నారు. ఆ దేవాలయాల ప్రాశస్త్యం, చరిత్ర, జాతర్లు, ఉత్సవాలు గురించి ప్రజలకు తెలిసేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్, దేవాదాయ అసిస్టెంట్ కమీషనర్ ను ఆదేశించారు. తొలివిడత జిల్లాలో సుమారు 20 పురాతన మరియు చారిత్రక దేవాలయాలను గుర్తించి ఆ దేవాలయాల ప్రాశస్త్యం, చరిత్రతో పాటు ఆ దేవాలయాల పరిధిలో నిర్వహించే ఉత్సవాలు, జాతర్లు ప్రజలకు తెలియచేసేలా చర్యలు తీసుకోవడంతో పాటు ఆ ఉత్సవాలు, జాతరలు పెద్ద ఎత్తున నిర్వహించేలా ప్రణాళికలు రూపొందించాలని జిల్లా కలెక్టర్ సూచించారు. జిల్లాలో దేవాదాయ భూములు అన్యాక్రాంతం కాకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమీషనర్ పానకాల రావు, సుపరింటెండెంట్ శ్రీధర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## చేతుల పరిశుభ్రతపై అవగాహన



(షణ్ముఖ వెలుగు కంభం అక్టోబర్ 15)
చేతుల పరిశుభ్రతతో ఆరోగ్య భద్రతను పొందవచ్చని ఎంపీడీవో వీరభద్రాచారి అన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రపంచ చేతుల పరిశుభ్రత దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు చేతుల పరిశు భ్రత పై అవగాహన కలిగించారు.చేతులను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా పలు రకాలైన వ్యాధుల ముప్పును తప్పించుకోవచ్చని అన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ-1 అబ్దుల్ సత్తార్, పీడీలు సుబ్రహ్మణ్యం, విజయకుమార్, ఉపాధ్యాయులు రమణారెడ్డి పాండురంగబాబు, మస్తాన్ వలి తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సీ సంక్షేమ నిధులు విడుదల చేయాలి

## ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో ప్రైవేటీకరణ విధానాన్ని విరమించుకోవాలి
## దళిత నేత చప్పిడి రవిశంకర్





**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, అక్టోబర్ 15)**

ప్రభుత్వ మెడికల్ కాలేజీలు ప్రైవేటీకరణ విధానాన్ని వ్యతిరేకిస్తున్నామని, ఎస్సీ కులాల సంక్షేమ నిధుల్ని విడుదల చేయాలని దళిత హక్కుల పోరాట సంఘం రాష్ట్ర అధ్యక్షులు చప్పిడి రవిశంకర్ డిమాండ్ చేశారు. బుధవారం ఒంగోలులోని కోలాస్ హెూటల్ ఎదురుగా ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలియ జేసినారు. ఈ సందర్భంగా చప్పిడి రవిశంకర్ మాట్లాడుతూ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రభుత్వం ఎస్సీ సంక్షేమంపై ఇచ్చిన హామీలకు తూట్లు పొడిచిందన్నారు. అధికారంలోకి వచ్చి 16 నెలలు గడుస్తున్నా ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్ల ద్వారా ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదన్నారు. జగన్ ప్రభుత్వం రద్దు చేసిన %ూజ, ూ%. 27 సంక్షేమ పథకాలను తాము అధికారంలోకి వస్తే ఆ పథకాలను అమలు చేస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం ప్రజాగలం పేరిట ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిందన్నారు. అయితే ఎస్సీ కార్పొరేషన్ నందు 24-25 ఆర్థిక సంవత్సరంలో మాల కార్పొరేషన్ కు 341 కోట్లు మాదిగ కార్పొరేషన్ కు 400 కోట్లు మంజూరు చేసినట్లు ప్రకటన చేసి.. ఆ ఆర్థిక సంవత్సరం ముగిసిన ఒక్క రూపాయి కూడా మాల,మాదిగలకు సబ్సిడీ రుణం ఇవ్వలేదన్నారు. తిరిగి ఈ 25-26 ఆర్థిక సంవత్సరానికి వేలకోట్లతో ఎస్సీ,ఎస్టీ యాక్షన్ ప్లాన్ ప్రకటించారే కానీ ఆరు నెలలైనా ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేద్న్నారు. ఎస్సీ ఎస్టీ జనాభా నిష్పత్తి ప్రకారం కేంద్ర ప్రభుత్వం ఇచ్చే ఎన్ఎస్ఎఫ్డీసీ, ఎన్ఎస్టీఎఫ్డీసీ,ఎన్బీసీఎఫ్డీసీ వంటి పథకాలకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి నిధులు తెచ్చి ఆ పథకాలు కూడా అమలు చేయాలని దళితులు పోరాడి సాధించుకున్న ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు మంజూరు చేయాలన్నారు. అంతేగాక ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఉన్న ప్రభుత్వ వైద్య క ళా శా ల ల ను ప్రైవేటీకరణ విధానం వ్యతిరేకిస్తున్నామని ఆ ప్రైవేటీకన్న వలన పేద విద్యార్థులకు మెడికల్ సీట్లు ప్రజలకు సరైన వైద్యం అంద దని కూటమి ప్రభుత్వం పీపీపీ అమలు చేయాలనే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని దళిత హక్కుల పోరాట సంఘం అధ్యక్షులు చప్పిడి. రవిశంకర్ డిమాండ్ చేసినారు ఈ కార్యక్రమంలో ఓ.అబ్రహాము, జాన్ వెస్లీ, కె. యేసుదాస్, ఎస్.ధన రాజ్, ఎస్కే జిలాని, బ్రహ్మ, కె.సామేలు, మోషే, మరియమ్మ,శాంతి విజయలక్ష్మి, మనోహర్, కావేరి, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

# సంతనూతలపాడు ఎమ్మెల్యే సామాజిక న్యాయం పాటించాలి



### ఎస్సీ అధికారులకు కొండపిలో ప్రాధాన్యం
### ఎస్ఎన్పాడులో అన్యాయం
### చీమకుర్తి సర్కిల్కు దళితుడిని సీఐగా నియమించాలి
### దళిత హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షులు నీలం నాగేంద్ర డిమాండ్

**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, అక్టోబర్ 15)**

ఎస్సీ రిజర్వ్డ్ సంతనూతలపాడు నియోజకవర్గంలో ఎమ్మార్వో, ఎస్సై, సీఐ, డీఎస్పీ పోస్టుల్లో ఎస్సీలకు అన్యాయం జరుగుతున్నదని, ఎమ్మెల్యే బి ఎన్ విజయ్ కుమార్ సామాజిక న్యాయం పాటించాలని దళిత హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు నీలం నాగేంద్రరావు డిమాండ్ చేశారు. బుధవారం ఒంగోలులోని తన కార్యాలయంలో జరిగిన సమావేశంలో నాగేంద్ర మాట్లాడుతూ ఉమ్మడి ప్రకాశం జిల్లా మొట్టమొదటి ఎస్సీ రిజర్వుడు నియోజకవర్గంలో ఎస్సీ అధికారులకు ప్రాధాన్యత లేదన్నారు. నాలుగు మండలాల సంతనూతలపాడు నియోజకవర్గంలో కీలకమైన చీమకుర్తి, మద్దిపాడు మండలాల తహసిల్దార్లు కమ్మ కులస్తులని, సంతనూతలపాడు తహసిల్దార్ రెడ్డి, నాగులుప్పలపాడు తహసిల్దార్ యాదవ అన్నారు.

ఇక ఎస్ఐల విషయానికి వస్తే నాలుగు పోలీస్ స్టేషన్లో ఒక్క మాల ఎస్ఐ కూడా లేరన్నారు. సంతనూతలపాడు నియోజకవర్గ పరిధిలో చీమకుర్తి, ఒంగోలు రూరల్, ఒంగోలు తాలూకా సర్కిల్స్ ఉన్నాయన్నారు. ఒంగోలు రూరల్, ఒంగోలు తాలూకా సర్కిల్ ఇన్స్పెక్టర్లు శ్రీకాంత్, విజయ్ కృష్ణ ఇద్దరూ కమ్మ కులస్తులే అన్నారు. హిందూపురం శాసనసభ్యుడు నందమూరి బాలకృష్ణ, వెలమ కులానికి చెందిన సుబ్బారావుకు పట్టాభిషేకం చేసి చీమకుర్తి సీఐగా పంపించారన్నారు. ప్రస్తుతం ఈ సీఐ సెలవులో వెళ్లిపోయారన్నారు. సంతనూతలపాడు నియోజకవర్గం ఒంగోలు డి.ఎస్.పి పరిధిలో ఉండగా, డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు కమ్మ కులస్తుడు కావడంలో ఆశ్చర్యమేమీ లేదన్నారు. పొరుగున ఉన్న సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి తాను ప్రాతినిధ్యం వహిస్తున్న కొండపి నియోజకవర్గంలో ఎస్సీలకు ప్రాధాన్యత ఇచ్చారన్నారు. కొండపి నియోజకవర్గంలోని 6 మండలాల్లో మూడు అనగా కొండపి, టంగుటూరు, మర్రిపూడి తహసిల్దార్లు ఎస్సీలని, పొన్నలూరు తాసిల్దార్ ఎస్టీ అని, జరుగుమల్లి, సింగరాయకొండ తహసిల్దార్లు నాయుడు కులస్తులన్నారు. సింగరాయకొండ, మర్రిపూడి ఎస్సైలు ఎస్సీలని, పొన్నలూరు ఎస్సై ఎస్టీ అని, కొండేపి, జరుగుమల్లి ఎస్సైలు బీసీలు అన్నారు. ఇక్కడ రెండు సర్కిల్స్ ఉండగా, సింగరాయకొండ సర్కిల్ ఇన్స్పెక్టర్ హజరత్తయ్య కమ్మ కాగా, కొండపి సీఐ సోమశేఖర్ ఎస్సీ అన్నారు. మంత్రి స్వామి, శాసనసభ్యులు బి.ఎన్ విజయ్ కుమార్ ఇద్దరూ ఎస్సీ మాల కులస్తులే అన్నారు. మంత్రిగా అవకాశం లభించడంతో వచ్చిన అధికారంతో స్వామి ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసి అధికారులకు సమ ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. ఐఏఎస్ అధికారి కుమారుడు, సీనియర్ రాజకీయ నాయకుడూ అయిన బిఎన్ విజయ్ కుమార్ నియోజకవర్గంలో రెవెన్యూ పోలీస్ అధికారులను తెలుగుదేశం పార్టీ జిల్లా అగ్రకుల కోటరీ ఎంపిక చేస్తుందన్నారు. ఇప్పటికైనా సంతనూతలపాడు ఎమ్మెల్యే బిఎన్ విజయ్కుమార్ ఎస్సీ ఎస్టీ అధికారులకు నియోజకవర్గంలో ప్రాధాన్యత కల్పించాలని, చీమకుర్తి సీఐగా దళితుడిని నియమించాలని నాగేంద్ర డిమాండ్ చేశారు.

# మెరిట్ విద్యార్థులను ప్రోత్సాహించేందుకు జాతీయ పోటీ పరీక్ష






**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, అక్టోబర్ 15)**

మెరిట్ విద్యార్థులను ప్రోత్సాహించేందుకు కే ఎల్ డిమ్డ్ యూనివర్సిటీ జాతీయ స్థాయి ప్రతిభ పోటీ పరీక్ష కే.ఎల్ డిమ్డ్ యూనివర్సిటీ విజయవాడ, హైదరాబాద్ , బెంగుళూరు క్యాంపస్లో 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించి ఇంజనీరింగ్ కోర్సుల్లో ప్రవేశానికై జాతీయ స్థాయిలో ప్రతిభ పరీక్షను నవంబర్ 14 నుండి 18 వరకు నిర్వహిస్తున్నట్లు కే.ఎల్. డిమ్డ్ యూనివర్సిటీ అడ్మిషన్స్ విభాగం డైరెక్టర్ డా. జె. శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం ఒంగోలు శ్రీ చైతన్య కళాశాల ఆవరణలో పోటీ పరీక్షకు సంబంధించిన పోస్టరును ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జాతీయ స్థాయిలో జరిగే ఈ పరీక్షలో ప్రతిభావంతులైన విద్యార్థులకు 100 కోట్ల రూపాయల మేర మెరిట్ స్కాలర్ షిప్స్ అందజేస్తున్నట్లు వివరించారు. అదే విధంగా కే.ఎల్. డిమ్డ్ విశ్వవిద్యాలయములో అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన మౌళిక వసతులు కల్పిస్తున్నామని, ప్రపంచంలోని అనేక ప్రముఖ విశ్వవిద్యాలయాలతో ఒప్పందం చేసుకొని అత్యుత్తమ విద్యను అందిస్తున్నామని తెలియజేశారు. విద్యార్థుల నైపుణ్యాలను అభివృద్ధి చేస్తూ 100 శాతం క్యాంపస్ ప్లేస్మెంట్స్ కోసం ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నామని తెలియజేశారు. ప్రస్తుత విద్యా సంవత్సరములో జాతీయ, అంతర్జాతీయ కంపెనీలలో తమ విద్యార్థులు 4600లకు పైగా ఫ్రీ క్యాంపస్ ప్లేస్మెంట్స్ ఆఫర్ పొందారని వారిలో సంవత్సరానికి 40లక్షల నుండి 75 లక్షల వరకు అత్యధిక వేతనాలు పొందిన వారు కూడా ఉన్నారని తెలియజేశారు. ఈ కార్యక్రమములో కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీ ఇంటర్నేషనల్ అడ్మిషన్స్ ఇంచార్జ్ జెవి షణ్ముక కుమార్, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక జోనల్ హెడ్ బి శివరామకృష్ణ, శ్రీ చైతన్య కళాశాల డీన్ యం రామకృష్ణ, ప్రిన్సిపల్స్ జి వెంకయ్య, ఏ రామాంజనేయులు, కె రవి కిషోర్, అకాడమిక్ ఇంచార్జ్ బి కిషోర్, కే ఎల్ డీమ్డ్ యూనివర్సిటీ ప్రకాశం, నెల్లూరు జిల్లాల మేనేజర్లు కె రాంబాబు, పి ఆంజనేయ వరప్రసాద్రావు, ఆర్ శేఖర్బాబు, ఏ మస్తాన్వలి, షేక్ నయాబ్, జి పార్థసారధి, కళ్యాణ్, జి చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి లోకేష్కు ఎల్ఈడీ లైట్స్తో ధన్యవాదాలు






**(షణ్ముఖ వెలుగు, యర్రగొండపాలెం, అక్టోబర్ 15)**

యర్రగొండపాలెం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబు ఆధ్వర్యంలో పెద్దారవీడు మండలం తంగిరాలపల్లి పంచాయతీ తమ్మడపల్లి గ్రామంలో ప్రపంచ దిగ్గజ కంపెనీ గూగుల్ని ఆంధ్రప్రదేశ్కు తీసుకు వచ్చిన నారా లోకేష్ అన్నకి ఎల్ఈడీ లైట్స్ తో ధన్యవాదములు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ , ఐటీడీపీ ఒంగోలు పార్లమెంట్ అధ్యక్షులు నక్కా శ్రీను మాట్లాడుతూ గూగుల్ రాకతో విశాఖలో టెక్ విప్లవం, రాష్ట్ర అభివృద్ధిలో మరో స్వర్ణయుగం ప్రారంభం అయింది అని, ప్రపంచ ప్రఖ్యాత టెక్ దిగ్గజ సంస్థ గూగుల్ ను విశాఖపట్నంలో స్థాపించటం నవ్యాంధ్రప్రదేశ్కు చారిత్రాత్మక ఘట్టం, ఈ విజయం రాష్ట్ర అభివృద్ధికి అంకితభావంతో కృషి చేస్తున్న ముఖ్యమంత్రి నా దైవం నారా చంద్రబాబు నాయుడు దూరదృష్టి నాయకత్వానికి నిదర్శనం అని ఉమ్మడి రాష్ట్రంలో ఆనాడు చంద్రబాబు మైక్రోసాఫ్ట్ ని హైదరాబాద్ కి తెచ్చి హైదరాబాద్ని గ్లోబల్ సిటీగా డెవలప్ చేస్తే, ఈనాడు లోకేష్ ప్రపంచ దిగ్గజ కంపెనీ గూగుల్ను వైజాగ్ కి తెచ్చి, వైజాగ్ సిటీని ప్రపంచపటంలో టాప్ గ్లోబల్ సిటీగా మారేందుకు సిద్ధమవుతుందన్నారు. దీని వల్ల ఆంధ్ర అభివృద్ధి ఫలితాలు వచ్చే 15 ఏళ్లలో ఆంధ్ర ప్రదేశ్ ప్రజలు చూస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షుడు తోకల యల్లయ్య, కుర్రా శ్రీనివాసులు, పిన్నిక శ్రీను, నక్కా యల్లయ్య, పోటు శ్రీను, పిన్నిక రామాంజనేయులు, కుర్రా చంటి, కుర్రా నాగరాజు, కుర్రా శివసాయి, పిన్నిక వెంకట్రావు, నక్కా వెంకట నారాయణ, కుర్రా నాగేశ్వరావు, పిన్నిక హరికృష్ణ, కుర్రా శివ, గ్రామ తెలుగుదేశం పార్టీ నాయకులు, ఐటీడీపీ యువకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# లింగారెడ్డి కాలనీ ప్రాథమిక పాఠశాలలో గ్లోబల్ హ్యాండ్ వాష్ కార్యక్రమం



**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, అక్టోబర్ 15)**

లింగారెడ్డి కాలనీ ప్రాథమిక పాఠశాలలో బుధవారం గ్లోబల్ హ్యాండ్ వాష్ కార్యక్రమం నిర్వహించారు. చేతుల శుభ్రత ఆరోగ్యానికి తొలిమెట్టు అని, ప్రతి రోజూ భోజనానికి ముందు చేతులు సబ్బుతో శుభ్రంగా కడుక్కోవడం వలన చేతులకు ఉన్న దుమ్ము ధూళి, గోర్లలో ఉన్న మట్టి తొలగి చేతులు శుభ్రంగా ఉండటం వలన ఆరోగ్యంగా ఉంటామని, అందువల్ల ప్రతి ఒక్కరూ, ప్రతి రోజు చేతులు శుభ్రంగా కడుకోవాలని విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం షేక్ మౌలాలి, ఉపాధ్యాయురాలు అలివేలు కుమారి పాల్గొన్నారు.

# డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా ప్రపంచ విద్యార్థుల దినోత్సవం



**(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, అక్టోబర్ 15)**

మండల కేంద్రమైన ఉలవపాడు జివిఎస్ ఎం గవర్నమెంట్ డిగ్రీ కళాశాలలో బుధవారం డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా ప్రపంచ విద్యార్థుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ డి సుజాత మేడం మాట్లాడుతూ కలాం గారి గొప్పతనాన్ని అతని జ్ఞానాన్ని అందరూ అలవర్చుకొని గొప్ప వాళ్ళు కావాలి అని విద్యార్థులకు సూచించారు. పెద్ద లక్ష్యాలను ధ్యేయంగా పెట్టుకోవాలని చిన్న లక్ష్యాలను నిర్దేశించుకోవడమే నేరమని విద్యార్థులకు చెప్పినటువంటి కలాం ఆశయాలను భౌతిక శాస్త్ర అధ్యాపకురాలు బి తేజస్వి విద్యార్థులకు సూచించడం జరిగింది. ఈ సందర్భంగా కళాశాల అధ్యాపకులు కలాం వ్యక్తిత్వాన్ని సాంకేతిక దృక్పథాన్ని, విద్యార్థుల పట్ల వారికి ఉన్న ప్రత్యేక దృష్టిని కొనియాడారు. ఈ కార్యక్రమంలో విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొని డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతిని ప్రపంచ విద్యార్థుల దినోత్సవం విజయవంతం చేసారు.

# మిస్సైల్ మ్యాన్ ఆఫ్ ఇండియా అబ్దుల్ కలాం






**(షణ్ముఖ వెలుగు, గిద్దలూరు, అక్టోబర్ 15)**

గిద్దలూరు నగర పంచాయతీలోని శాఖ గ్రంధాలయం నందు అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశానికి లైబ్రరీ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు రామిరెడ్డి అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయులు పిచ్చయ్య హాజరయ్యారు. అబ్దుల్ కలాం చిత్ర పటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. రామిరెడ్డి మాట్లాడుతూ అబ్దుల్ కలాం జీవిత చరిత్ర విద్యార్థులకు ఆదర్శ వంతంగా ఉందన్నారు. ఆయన పౌర పురస్కారాలైన పద్మభూషణ్, పద్మవిభూషణ్ మరియు భారతరత్నలతో సహా అనేక పురస్కారాలను అందుకున్నారన్నా రు. పిచ్చయ్య మాట్లాడుతూ చదువుకోవడానికి పేదరికం అడ్డు రాదని, విద్య వలనే ఉన్నత శిఖరాలను అధిరోహించగలమని అబ్దుల్ కలాం నిరూపించారన్నారు.అబ్దుల్ కలాం భారతదేశానికి ఒక ప్రముఖ శాస్త్రవేత్త, మాజీ రాష్ట్రపతి మరియు "మిస్సైల్ మ్యాన్ ఆఫ్ ఇండియా"గా ప్రసిద్ధి చెందారు. బాలిస్టిక్ క్షిపణి మరియు ప్రయోగ వాహన సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధికి ఆయన కీలక పాత్ర పోషించారన్నారు. శివప్రసాద్ మాట్లాడుతూ అబ్దుల్ కలాం నేటితరం విద్యార్థులకు ఆదర్శప్రాయాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి కిషోర్, కార్యదర్శి ఫరూక్, తదితరులు పాల్గొన్నారు.

# నైపుణ్యాభివృద్ధి, మరిన్ని ఉపాధి అవకాశాల కల్పనే ధ్యేయంగా పని చేయాలి

**జిల్లా కలెక్టర్ పి రాజాబాబు**

**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, అక్టోబర్ 15)**

నైపుణ్యాభివృద్ధి, మరిన్ని ఉపాధి అవకాశాల కల్పనే ధ్యేయంగా పరిశ్రమలు, అనుబంధ విభాగాలు పని చేయాలని జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు స్పష్టం చేశారు. జిల్లా పరిశ్రమల కేంద్రం, ఏపీఐఐసీ ఉన్నతాధికారులతో బుధవారం ప్రకాశం భవనములోని తన చాంబర్లో ఆయన ప్రత్యేకంగా సమీక్షించారు. జిల్లాలో పరిశ్రమల స్థితిగతులు, కొత్త వాటిని స్థాపించేందుకు అవకాశం ఉన్న రంగాలు, ఈ దిశగా ప్రోత్సహించేందుకు తీసుకుంటున్న చర్యలు, ప్రభుత్వం వైపు నుంచి అందుతున్న ఆర్థిక సహాయం, ఇప్పటికే వివిధ రంగాలలో ఉన్న వారికి అవసరమైన నైపుణ్య అభివృద్ధి కోసం నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమాలను జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ శ్రీనివాసరావు ఈ సందర్భంగా కలెక్టరుకు వివరించారు. దీనిపై కలెక్టర్ మాట్లాడుతూ కేవలం శిక్షణకే పరిమితం కాకుండా వ్యాపారాలను



విస్తరించుకునేందుకు అవసరమైన డీ.పి.ఆర్ రూపకల్పన, బ్యాంకు రుణాల మంజూరు వంటి ప్రక్రియ పూర్తయ్యేంతవరకు తోడుగా నిలవాలని స్పష్టం చేశారు. ముడి సరుకుల లభ్యత నుంచి ఉత్పత్తుల మార్కెటింగ్ వరకు అవసరమైన సహకారాన్ని కచ్చితంగా అందించాలన్నారు. ప్రతి కుటుంబం నుంచి ఒక పారిశ్రామికవేత్త రావాలన్నది ముఖ్యమంత్రి ఆశయమని కలెక్టర్ గుర్తు చేశారు. పీఎం విశ్వకర్మ, పీఎం ఈజీపి వంటి పథకాలను కేంద్ర ప్రభుత్వం ప్రారంభించినందున వాటి ప్రయోజనాలు అర్హులకు పూర్తిస్థాయిలో అందేలా నిరంతర పర్యవేక్షణ అవసరమని ఆయన స్పష్టం చేశారు. నూతన పరిశ్రమల స్థాపన, విస్తరణ, ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా సమన్వయంతో సంబంధిత శాఖలు పనిచేయాలని కలెక్టర్ దిశా నిర్దేశం చేశారు. నిర్దిష్ట ఉత్పత్తులను మార్కెటింగ్ చేసేందుకు అవసరమైన బ్రాండ్ ప్రమోటర్స్, ప్రోడక్ట్ ప్రమోటర్లతో పాటు చార్టెడ్ అకౌంటెంట్లను ఆహ్వానిస్తే ప్రత్యేక సమావేశం నిర్వహించి చేతివృత్తిదారులకు జిల్లా యంత్రాంగం అండగా నిలుస్తుందని తెలిపారు. ఈ దిశగా కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ మదన్, వివిధ ప్రభుత్వ పథకాలపై చేతి వృత్తుదారులకు అవగాహన కల్పించే సంస్థల ప్రతినిధులు, ఇతర అధికారులు పాల్గొన్నారు. ఈ సమావేశం అనంతరం పారిశ్రామిక రంగంలో పెట్టుబడులను ప్రోత్సహించేందుకు, సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకునేందుకు " ఏపీఐఐసీ - ఇండస్ట్రీ భాగస్వామ్య డ్రైవ్ " పేరుతో అక్టోబర్ 15వ తేదీ నుంచి నవంబర్ 15వ తేదీ వరకు నిర్వహించే ప్రత్యేక కార్యక్రమాల పోస్టరును కలెక్టర్ ఆవిష్కరించారు.







# కంభంలో సామాజిక స్పృహకు చిరునామా సయ్యద్ జాకీర్ హుస్సేన్







**(షణ్ముఖ వెలుగు, కంభం, అక్టోబర్ 15)**

కంభం పట్టణంలో సామాజిక స్పృహకు, సేవానిరతికి చిరునామాగా వ్యవహరిస్తూ అందరి ప్రశంసలు పొందుతూ ముందుకు సాగుతున్నారు మాజీ జడ్పీటీసీ , లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ చైర్మన్ సయ్యద్ జాకీర్ హుస్సేన్. స్థానిక ఏబీఎం చర్చి సమీపంలో అర్ధవీడు వెళ్ళు మలుపు వద్ద గతంలో ప్రయాణికుల సౌకర్యార్థం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సిమెంట్ బెంచీలు ఏర్పాటు చేయగా, ఇటీవల అక్కడ కాలువ మరమ్మత్తుల పనులలో అవి ధ్వంసం అయ్యాయి. దీనితో నిత్యం అటువైపుగా వెళ్ళు ప్రయాణికులు కూర్చునే చోటు లేక అసౌకర్యానికి గురి అయ్యారు. ఈ సమస్యను గుర్తించిన మాజీ జడ్పీటీసీ జాకీర్ హుస్సేన్ వెంటనే స్పందించి తన స్వంత నిధులతో రెండు నూతన సిమెంట్ బెంచీలను ఏర్పాటు చేసారు. అదే విధంగా స్థానిక శరభారెడ్డి వీధిలోని పాత లైబ్రరీ వద్ద గల ఆంజనేయ స్వామి గుడికి నిత్యం వచ్చే భక్తులకు కాళ్ళు, చేతులు శుభ్రం చేసుకొనుటకు సరైన నీటి వసతి లేక భక్తుల ఇబ్బంది గమనించిన ఆయన అక్కడ ఉన్న స్థానికుల విజ్ఞప్తి మేరకు వెంటనే శాశ్వత నీటి కుళాయి కొరకు గ్రామ పంచాయతీ వారితో మాట్లాడి నీటి కనెక్షన్ మంజూరు చేయగా, దానికి కావాల్సిన వస్తువులను సొంత నిధులతో తెప్పించి సత్వరమే ఆంజనేయ స్వామి గుడికి నీటి వసతిని కల్పించడం జరిగింది. దీనితో ఎంతో కాలంగా నిత్యం అసౌకర్యానికి గురవుతున్న భక్తులు కుల మతాలకు అతీతంగా చేస్తున్న జాకీర్ హుస్సేన్ వితరణ కార్యక్రమాలను కొనియాడి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా జాకీర్ హుస్సేన్ మాట్లాడుతూ గ్రామ సంక్షేమానికి, అవసరార్థుల కొరకు తన శక్తి మేరకు ఎల్లప్పుడూ కృషి చేస్తుంటానని, ఇటువంటి సేవా కార్యక్రమాలు తనకు ఎంతో సంతృప్తిని కలుగజేస్తాయని చెప్పారు. యువనాయకుడు జాకీర్ హుస్సేన్ సేవలను పలువురు పెద్దలు కొనియాడారు.

# మాగుంటకు జన్మదిన శుభాకాంక్షలు




**(షణ్ముఖ వెలుగు, పొదిలి, అక్టోబర్ 15)**

ఒంగోలు పార్లమెంటు సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డి జన్మదిన వేడుకలు ఒంగోలులోని ఆయన నివాసంలో బుధవారం ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి గునుపూడి భాస్కర్, పొదిలి ఏఎంసి డైరక్టర్ సోమిశెట్టి శ్రీదేవిలు పాల్గొని ఆయనకు పూల బొకేలు అందజేసి శాలువాతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. నిండు నూరేళ్ళు ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలతో ప్రజలకు మరిన్ని సేవలు అందించాలని వారు ఆకాంక్షించారు.

# ఎంపీ మాగుంటకు శుభాకాంక్షలు తెలిపిన తాతా ప్రసాద్



**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, అక్టోబర్ 15)**

ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి పుట్టినరోజు సందర్భంగా మాగుంట కార్యాలయంలో శ్రీనివాసులురెడ్డిని, రాఘవ రెడ్డిని మాజీ సూపర్ బజార్ చైర్మన్ తాతా ప్రసాద్ కలిసి సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఇంకా ముందు ముందు సేవా కార్యక్రమాలు చేపట్టాలని, ఇంకా మరెన్నో పుట్టినరోజు వేడుకలు చేసుకోవాలని ఆకాంక్షించారు.

# ఉలవపాడు శ్రీ సాయి హైస్కూల్‌లో 8వ రాష్ట్రీయ పోషణ మాస కార్యక్రమం







**(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, అక్టోబర్ 15)**

మండల కేంద్రమైన ఉలవపాడు శ్రీ సాయి హైస్కూల్ నందు ఉలవపాడు ఐసిడిఎస్ ప్రాజెక్ట్ సిడిపిఓ మాధవి లత, సూపర్వైజర్ కె రమాదేవి ఆధ్వర్యంలో 8వ రాష్ట్రీయ పోషణ మాస కార్యక్రమంలో భాగంగా అంతర్జాతీయ బాలికల దినోత్సవం కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిడిపిఓ మాట్లాడుతూ విద్యార్థులకు బాల్యవివాహాలపై అవగాహన కల్పించడం జరిగింది. మరియు విద్యార్థులకు పోషక విలువలు, మంచి స్పర్శ, చెడు స్పర్శ, ఒబిసిటీ, పర్సనల్ హై జింక్ వి గురించి వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ వ్యక్తిగత పరిశుభ్రత గురించి వివరించడం జరిగింది. అంతర్జాతీయ బాలికల దినోత్సవం గురించి బాలికలకు వివరించడం జరిగింది. అనంతరం బాలికలతో ర్యాలీ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ కె.రమాదేవి, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# జిల్లాలో అందుబాటులో 308 మెట్రిక్ టన్నుల యూరియా

**యూరియా కొరత లేదన్న విషయాన్ని రైతులకు వ్యవసాయ శాఖ అధికారులు తెలపాలి జిల్లా కలెక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్**



**(షణ్ముఖ వెలుగు, బాపట్ల, అక్టోబర్ 15)**

జిల్లాలో యూరియా కొరత లేదన్న సమాచారాన్ని వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు ముందురోజే తెలియజేయాలని,జిల్లాలో 308 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాయులో ఉందని రైతులు వచ్చి యూరియా తీసుకొనివేళ్ళవచ్చునని జిల్లా జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం బాపట్ల జిల్లా లో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఆర్ ఎస్ కె లు మరియు పి ఏ సి ఎస్ కేంద్రాల 37 ద్వారా 412 మెట్రిక్ టన్నుల యూరియా ను 4786 మంది రైతులకు పంపిణీ చేయడం జరిగిందని, ఇంకా 308 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటు లో ఉందని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు.

On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL/2023/89152, e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com

# బాపట్ల జిల్లా సంయుక్త కలెక్టర్‌గా భావన వశిష్ట









(షణ్ముఖ వెలుగు, బాపట్ల, అక్టోబర్ 15)

ప్రజలలో భూ సమస్యలన్నీ పరిష్కరిస్తామని జిల్లా సంయుక్త కలెక్టర్ భావన వశిష్ట తెలిపారు. కలెక్టరేట్ కు చేరుకున్న జిల్లా సంయుక్త కలెక్టర్ కు బుధవారం ఘన స్వాగతం లభించింది. డిఆర్ఓ గంగాధర్ గౌడ్, జిల్లా కలెక్టరేట్ ఏఓ మల్లికార్జునరావులు పుష్పగుచ్చాలతో ఆమెకు ఘన స్వాగతం పలికారు. అనంతరం వేదపండితులు వేదమంత్రోచ్చారణ, పూర్ణ కుంభంతో స్వాగతిస్తూ కార్యాలయంలో పూజలు నిర్వహించారు. జిల్లా సంయుక్త కలెక్టర్ గా భావన వశిష్ట బాధ్యతలు స్వీకరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ ని మర్యాదపూర్వకంగా కలసిన సంయుక్త కలెక్టర్ పుష్పగుచ్చాలను అందజేశారు. అనంతరం వివిధ శాఖల జిల్లా అధికారులు జిల్లా సంయుక్త కలెక్టర్ ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చాలతో అభినందనలు తెలిపారు. బాపట్ల జిల్లాకు సంయుక్త కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టడం చాలా సంతోషంగా ఉందని జాయింట్ కలెక్టర్ భావన వశిష్ట తెలిపారు. ప్రభుత్వ పథకాలన్నీ జిల్లాలోని పేద ప్రజలకు అందేలా చూస్తామన్నారు. ముఖ్యంగా రెవిన్యూ వ్యవస్థలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ప్రజలు భూ సమస్యలతో ఇబ్బందులు పడకుండా పరిష్కారానికి అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజా పంపిణీ వ్యవస్థ సక్రమంగా సాగేలా చూస్తామన్నారు. 2019 ఐఏఎస్ బ్యాచ్ గా వివిధ ప్రాంతాల్లో పనిచేశానన్నారు. ఇంతకు ముందు కృష్ణా జిల్లాలో ఏసి యుటి గాను, పార్వతీపురంలో సబ్ కలెక్టర్ గాను, జీఎస్ ఎస్ డబ్ల్యూ ఎస్ రీజనల్ జాయింట్ డైరెక్టర్, జిల్లాలో సంయుక్త కలెక్టర్, రిటర్నింగ్ అధికారిగాను పని చేసిన అనుభవం ఉందన్నారు. కాకినాడలో మున్సిపల్ కమిషనర్ గా విధులు నిర్వహిస్తుండగా బాపట్ల జిల్లా సంయుక్త కలెక్టర్ గా నియమిస్తూ ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ఆ మేరకు ఇక్కడకు వచ్చానని, ప్రజలకు మేలు చేయడమే లక్ష్యంతో ముందుకు వెళ్తామన్నారు. బాధ్యతలు తీసుకున్న అనంతరం జిల్లా కలెక్టర్ వి వినోద్‌కుమార్‌ను ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పూల కుండి అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బాపట్ల, చీరాల, రేపల్లె ఆర్డీఓలు పి గ్లోరియా, చంద్రశేఖర్ నాయుడు, యన్ రామలక్ష్మి, బాపట్ల మండలం తహశీల్దార్ సలీమా షేక్, జిల్లా కలెక్టరేట్ సిబ్బంది, తదితరులు ఉన్నారు.

# లోతట్టు ప్రాంతాలను పరిశీలించిన నగర మేయర్ గంగాడ సుజాత



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, అక్టోబర్ 15)

18వ డివిజన్ మదర్ థెరిస్సా కాలనీలో కురుస్తున్న వర్షాలకు, లోతట్టు ప్రాంతాలను నగర మేయర్ గంగాడ సుజాత సందర్శించడం జరిగినది. ఈ క్రమంలో మేయర్ మాట్లాడుతూ నిల్వ ఉన్న నీళ్లను మళ్లించేందుకు చర్యలు తీసుకోవాల్సిందిగా అధికారులను ఆదేశాలు ఇచ్చారు. కాలనీలోని రోడ్లను, గుంతలను మరమ్మత్తులు త్వరగా పూర్తి చేయాలని ఆదేశాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఎంఈ, మున్సిపల్ సిబ్బంది, సచివాలయం సిబ్బంది, పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# సంపూర్ణ ఆరోగ్యంతో వ్యాధులు మటుమాయం





(షణ్ముఖ వెలుగు, నూజండ్ల, అక్టోబర్ 15)

సంపూర్ణ ఆరోగ్యంగా ఉండడం కోసం ప్రతిరోజు చేతులను శుభ్రంగా కడుక్కోవాలని మండల కోఆర్డినేటర్ కంచర్ల సుబ్బరామయ్య అన్నారు. ప్రపంచ స్నేహితుల పరిశుభ్రతా దినోత్సవం సందర్భంగా బుధవారం ఎంపీడీవో ఆదేశాల మేరకు మండలంలోని ములకలూరు గ్రామంలో డ్వాక్రా మహిళలచే, కొండలరాయునిపాలెం గ్రామంలో పాఠశాలలోని విద్యార్థులచే చేతుల పరిశుభ్రత దినోత్సవం నిర్వహించడం జరిగిందని ఎక్కువగా వ్యాధులు మన చేతులు నుంచి వైరస్ బ్యాక్టీరియాల ద్వారానే వ్యాప్తి చెందుతాయని కాబట్టి చేతులు కడుక్కోవడం ఒక అలవాటుగా మార్చుకోవాలని అన్నారు. ముఖ్యంగా భోజనానికి ముందు తర్వాత చేతులను శుభ్రంగా కడుక్కోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకట కృష్ణారావు, ఉపాధ్యాయులు, ఏఎన్ఎం కుమారి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# మహిళలను దూషించి కప్పిపుచ్చుకునేందుకు ఆరోపణలు చేస్తున్న బొల్లా

## జిడిసిసిబి ఛైర్మన్ మక్కెన మల్లిఖార్జునరావు



(షణ్ముఖ వెలుగు, వినుకొండ, అక్టోబర్ 15)

మహిళలను కించపరిచే విధంగా మీడియా సాక్షిగా వ్యాఖ్యలు చేసిన మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అంశాన్ని కప్పిపుచ్చుకునేందుకు నిరాధారమైన ఆరోపణలు చేయటం సిగ్గుచేటని జిడిసిసిబి చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు అన్నారు. వినుకొండ పట్టణములోని చీఫ్ విప్ కార్యాలయంలో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో మక్కెన మాట్లాడుతూ బొల్లా బ్రహ్మనాయుడు నూటికి వచ్చినట్టు పొంతన లేకుండా మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. ఎక్సైజ్ కార్యాలయం వద్ద మీడియాతో మాట్లాడిన బ్రహ్మనాయుడు ఆడవాళ్లు మందు తాగుతున్నారని, వారి ప్రవర్తనను ప్రజలకు చెబుతున్నారని మహిళలను కించపరిచే విధంగా మాట్లాడిన బొల్లా దేశరత్తుగా మహిళలకు క్షమాపణ చెప్పకుండా నా మాటలను టిడిపి వాళ్లు వక్రీకరించారని, నిరాధారణమైన ఆరోపణలు చేస్తూ కప్పిపుచ్చుకోనేందుకు దాటవేసే ప్రయత్నం చేయటం నీచమైన చర్య అన్నారు. బొల్లా స్పష్టంగా మాట్లాడిన మాటలు వీడియో రికార్డు అయ్యాయని, వాటిని టిడిపి, కూటమి నాయకులు మార్ఫింగ్ చేసి ఉంటే నిజం నిర్ధారణకు పంపుదామని నీ నిజ స్వరూపం తేటతెల్ల మవుతుందాన్నారు. నేను చేపల వ్యాపారం చేస్తున్నానని, సొసైటీ బైలా ప్రకారం పెట్టుబడులు పెట్టి వ్యాపారం చేస్తున్నట్లు స్పష్టం చేశారు. నిజాయితీగా చేస్తున్న చేపల వ్యాపారాన్ని మీరు వక్రీకరించి ఆరోపించడం దుర్మార్గం అన్నారు. ఎదుటి వారి వ్యాపారాల గురించి మాట్లాడేటప్పుడు నీ వ్యాపారం ఏంటో చెప్పాలని మక్కెన ప్రశ్నించారు. మీ తండ్రి గేదెల దళారి చేస్తూ వచ్చిన కమిషన్ పై నిన్ను సాకాడని, నీవు డబ్బాలు నెత్తిన పెట్టుకొని గ్రామాల్లో సినిమాలు వేశావు కదా.. నీ జీవితం ఏంటో అందరికీ తెలుసునని, నోటికి వచ్చినట్టు విమర్శిస్తే సహించేది లేదని బొల్లా బ్రహ్మనాయుడు కి సూటిగా మక్కెన హెచ్చరించారు. మహిళలను నోటికొచ్చినట్టు మాట్లాడి దూషించి కప్పిపుచ్చుకునే ధోరణి ప్రదర్శించడం సరికాదని అన్నారు. సమావేశంలో టిడిపి నాయకులు పాల్గొన్నారు.

# ఎంపి మాగుంటకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన బిజెపి జిల్లా అధికార ప్రతినిధి బెల్లంకొండ

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, అక్టోబర్ 15)





ఒంగోలు పట్టణంలో బుధవారం పార్లమెంటు సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా బిజెపి అధికార ప్రతినిధి, బిట్స్ విద్యాసంస్థల సిఈఓ బెల్లంకొండ విజయలక్ష్మి, బెల్లంకొండ విద్యాసంస్థల సెక్రటరీ & కరెస్పాండెంట్ డాక్టర్ బెల్లంకొండ శ్రీనివాసరావులు పాల్గొని ఆయనకు బొకే అందజేసి శాలువాతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వారు కేక్ కట్ చేయించి స్వయంగా కేక్ తినిపించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రకాశం జిల్లా త్రాగునీటి, విద్యారంగ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్న, నిగర్వి స్వభావం గల స్నేహశీలి, పేద బడుగు వర్గాల ఆశాజ్యోతి అని మాగుంట శ్రీనివాసులురెడ్డి సేవలను ప్రశంసించారు. కార్యక్రమంలో బిట్స్ కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు, స్థానిక నేతలు, మాగుంట అభిమానులు పాల్గొని జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.





# ప్రతిరోజూ జరిగిన రిజిస్ట్రేషన్ల వివరాలు కలెక్టరేట్‌కు పంపించాలి

## జిల్లా రిజిస్ట్రార్‌ను ఆదేశించిన కలెక్టర్ పి రాజాబాబు





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, అక్టోబర్ 15)

ప్రతిరోజూ జరిగిన రిజిస్ట్రేషన్ల వివరాలను కలెక్టరేటుకు పంపించాలని జిల్లా రిజిస్ట్రారును కలెక్టర్ పి రాజాబాబు ఆదేశించారు. స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ అధికారులతో బుధవారం ప్రకాశం భవనంలోని తన చాంబర్లో ఆయన ప్రత్యేకముగా సమీక్షించారు. జిల్లాల వారీగా ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యం, మన జిల్లాలో సబ్ రిజిస్టార్ కార్యాలయాల వారీగా వచ్చిన ఆదాయం, రిజిస్ట్రేషన్ అనంతరం ఆటో మ్యూటేషన్, నిషేధిత భూముల వివరాలు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు చేరుతున్న తీరు, తదితర అంశాలను జిల్లా రిజిస్ట్రార్ బాలాంజనేయులు కలెక్టరుకు వివరించారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ గతంలో జిల్లాలో ఫోర్జరీ సంతకాలు, నకిలీ స్టాంపులతో జరిగిన భూ కుంభకోణంపై ఆరాదీశారు. తమ భూమి తమ ఆధీనంలోనే ఉన్నా వెబ్ ల్యాండులో ఇతరుల పేరు ఉన్నట్లు ' మీకోసం ' కార్యక్రమంలో ఫిర్యాదులు వస్తున్నాయని కలెక్టర్ చెప్పారు. తప్పుడు రిజిస్ట్రేషన్ లపై సరైన చర్యలు తీసుకుని బాధితులకు న్యాయం చేసే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించినందున రోజువారీగా భూముల రిజిస్ట్రేషన్ల వివరాలను కలెక్టరేటుకు పంపించాలని ఆయన ఆదేశించారు. భూ ఆక్రమణలకు, అక్రమ రిజిస్ట్రేషన్లకు అడ్డుకట్ట వేసేలా ఈ వివరాలను పరిశీలించేందుకు కలెక్టరేట్లో ప్రత్యేక సిబ్బందిని కేటాయిస్తానని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో ఒంగోలు సబ్ రిజిస్ట్రార్ సిహెచ్.ఎన్.వరప్రసాదరావు, జాయింట్ సబ్ రిజిస్ట్రార్ కె శ్రీనివాసరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

మెరుగైన సేవలపై దృష్టి : విపత్తుల నిర్వహణ - అగ్నిమాపక శాఖ, చేనేత - జౌళి శాఖ, జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ, ఖజానా శాఖ అధికారులతోనూ కలెక్టర్ సమీక్షించారు. మెరుగైన సేవలు అందించడంపై దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. ఇందుకోసం ఆయా శాఖల అవసరాలు, నిధుల లభ్యతపై ఆరా తీశారు. డిఎంఎఫ్ నిధులనుంచి ఆర్థిక వనరులను సమకూరుస్తామని చెప్పారు. జిల్లా విపత్తుల నిర్వహణ - అగ్నిమాపక అధికారి శ్రీనివాస్ రెడ్డి, చేనేత జౌళి శాఖ సహాయ సంచాలకులు రఘునంద , జిల్లా ఖజానా అధికారి జగన్నాధ రావు, జిల్లా క్రీడా అధికారి రాజరాజేశ్వరి, ఇతర అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

## ప్రజల రాష్ట్రపతి అబ్దుల్ కలాం ఆశయ సాధనకు పునరంకితం మేధ శ్రీనివాసరావు



(షణ్ముఖ వెలుగు, బాపట్ల, అక్టోబర్ 15)

భారత ప్రజల రాష్ట్రపతిగా అభిమానించబడే భారతరత్న ఏపీజే అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా బుధవారం నాడు బాపట్ల మున్సిపల్ ఆఫీస్ దగ్గర అబ్దుల్ కలాం విగ్రహానికి పూలమాల అలంకరించి వారి ఆశయ సాధనకు పునరంకితమవుతామని సమాజవాది పార్టీ బాపట్ల అధ్యక్షులు మేధ శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా మేధ శ్రీనివాసరావు మాట్లాడుతూ సామాన్య కుటుంబంలో జన్మించిన కలాం మిస్సైల్ మాన్ గా భారతదేశం గర్వించే రాష్ట్రపతిగా ప్రజల మన్నలను పొందారని వారికి విద్య విద్యార్థులు యువజనుల పట్ల ఉన్న ఆసక్తి ప్రోత్సహం అక్టోబర్ 15 ను ప్రపంచ విద్యార్థి దినముగా జరుపుకోవడం జరుగుతుంది. అబ్దుల్ కలాం తరచుగా కలలు కనండి వాటిని నిజం చేయండి అని బోధించేవారు. వారి ఆశయాలు సాధించుట వారికి ఘనమైన నివాళి అని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎల్ఐసి ప్రసాద్ రావు, కాంద్రు శరత్ కుమార్ ,మోర్ల చిన వెంకటేశ్వరరావు, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## మాగుంటకు జన్మదిన శుభాకాంక్షలు




(షణ్ముఖ వెలుగు, కనిగిరి, అక్టోబర్ 15)

ఒంగోలు పార్లమెంటు సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డి జన్మదిన వేడుకలు ఒంగోలులోని ఆయన నివాసంలో బుధవారం ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో జిల్లా ఎంపీటీసీల సంఘం అధ్యక్షులు ఆకుపాటి వెంకటేష్ పాల్గొని మాగుంటను శాలువాతో సత్కరించి ఆయన చిత్రపటాన్ని బహుకరించారు. ఈ కార్యక్రమంలో ఆకుపాటి వెంట ఇండ్ల నరసింహారావు, పుప్పాల రాంమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

## నివాళులు అర్పించిన ఎమ్మెల్యే సోదరుడు ముత్తుముల క్రిష్ణ కిశోర్‌రెడ్డి



(షణ్ముఖ వెలుగు, కంభం, అక్టోబర్ 15)

మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు తోట శ్రీనివాసులు తల్లి తోట లక్ష్మీదేవి (78) బుధవారం అకాల మరణం పొందారు. విషయం తెలుసుకున్న గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి సోదరుడు ముత్తుముల క్రిష్ణ కిశోర్‌రెడ్డి వారి నివాసం వద్దకు వెళ్లి ఆమె పార్థీవ దేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం క్రిష్ణ కిశోర్ మాట్లాడుతూ లక్ష్మిదేవి అక్క ఎంతో మంది పేదలకు తన వంతు సహాయం చేసేవారన్నారు. కుటుంబ పెద్దని కోల్పోవడం చాలా బాధాకరం అని, దేవుడు ఆమె పవిత్ర ఆత్మకు శాంతి చేకుర్చాలని కోరుకుంటూ మనో ధైర్యంతో ఉండాలని వారి కుటుంబ సభ్యులకు భరోసా ఇచ్చారు. ఆయన వెంట కంభం మండల తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని నివాళులు అర్పించారు.

# చేతులు శుభ్రత ఆరోగ్యానికి భద్రత

### మున్సిపల్ చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్ ఘనంగా గ్లోబల్ హ్యాండ్ వాష్ డే



(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, అక్టోబర్ 15)

చేతుల పరిశుభ్రత ఆరోగ్య భద్రతలో కీలకమైనదని కనిగిరి మున్సిపాలిటీ చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్ అన్నారు. గ్లోబల్ హ్యాండ్ వాష్ డే సందర్భంగా బుధవారం కనిగిరి పట్టణం నాలుగోవ వార్డు పరిధిలోని మండల పరిషత్ ప్రాథమికొన్నత పాఠశాల నందు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సమగ్ర శిక్షా, బంగారు బాల్యం కమిటి,గుడ్ హెల్ప్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో చేతులు శుభ్రత పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం అక్టోబర్ 15న ప్రపంచవ్యాప్తంగా గ్లోబల్ హ్యాండ్ వాష్ డేని నిర్వహిస్తారని అన్నారు. చేతులు శుభ్రంగా కడుక్కోవడం ద్వారా వ్యాధుల నివారణపై ప్రజల్లో అవగాహన కలిగించడమే ఈ దినోత్సవం ఉద్దేశ్యమని అన్నారు.ముఖ్యంగా విద్యార్థులు చేతులు శుభ్రంగా




ఉంచుకోవడం ద్వారా తమ ఆరోగ్యాన్ని కాపాడుకోగలరని అన్నారు.చేతులకు అంటుకున్న మట్టి, సూక్ష్మజీవులు, బ్యాక్టీరియా,వైరస్‌లను తొలగించడానికి సబ్బుతో చేతులు కడుక్కోవడం అవసరమని తెలిపారు.చేతులు కడుక్కోవడం ఆరోగ్య జీవన రక్షణకు తొలి అడుగని ఇది జలుబు, ఫ్లూ, జీర్ణశయాంతర ఇన్ఫెక్షన్‌లు వంటి వ్యాధులు 70 శాతం సోకకుండా నివారించి మొత్తం ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుందని అన్నారు.ఈ



కార్యక్రమంలో విద్యార్థులకు చేతులు శుభ్రత పై 7 స్టెప్స్ డెమో ద్వారా ఎప్పుడెప్పుడు చేతులు శుభ్రం చేసుకోవాలో అవగాహన కలిగించారు.కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎస్ కె సమావుల్లా,బంగారు బాల్యం కమిటీ సభ్యులు,గుడ్ హెల్ప్ ఫౌండేషన్ డైరెక్టర్ రమేష్ బాబు, ఉపాధ్యాయులు వసంత కుమారి, ఎ వి నారాయణ,అనురాధ, పవన్ కుమార్,షహనాజ్ బేగం తదితరులు పాల్గొన్నారు.

# ఆక్వా పార్క్, ఓడరేవు నిర్మాణం ద్వారా మత్స్య, ఆక్వా రంగం అభివృద్ధి

### జిల్లా కలెక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్



(షణ్ముఖ వెలుగు, బాపట్ల, అక్టోబర్ 15)

ఆక్వా పార్క్, ఓడరేవు నిర్మాణం ద్వారా మత్స్య,ఆక్వా రంగం మరింత అభివృద్ధి కానుందని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్ తెలిపారు. బుధవారం,నిజాంపట్నం మండలంలో ఇంటిగ్రేటెడ్ ఆక్వా పార్క్, ఓడరేవు అభివృద్ధి పనులను జిల్లా కలెక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్ పరిశీలించారు. నిజాంపట్నం మండలం, యామినేనివారిపాలెం లో 192.42 ఎకరాలలో ఆక్వా పార్క్ అభివృద్ధి చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్ తెలిపారు. ఈ ఆక్వా పార్క్ వలన మత్స్యకారులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందన్నారు.మత్స్య సంపద అభివృద్ధికి ఈ పార్క్ కేంద్రం కానుందన్నారు. ఆక్వా పార్క్ అభివృద్ధికి టెండర్ ప్రక్రియ పూర్తయినప్పటికీ పనులు ప్రారంభించకపోవుటకు కారణాలను, అడ్డంకులపై మేరటైన్ బోర్డు అధికారులను ఆయన ఆరా తీశారు. ఆక్వా పార్క్ అభివృద్ధి ప్రాంతంలో చిల్ల మొక్కలను తొలగించి రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించినట్లు టి వి వి ఎస్ యన్ కాంట్రాక్టర్ జిల్లా కలెక్టర్ కు వివరించారు. పార్కు అభివృద్ధికి నిధులు మంజూరైనాయని పనులను వెంటనే ప్రారంభించి ఒక సంవత్సరంలోపు పూర్తి చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. నిజాంపట్నంలోని ఓడరేవు అభివృద్ధి పనులకు 2022 సంవత్సరంలో అగ్రిమెంట్ తీసుకొని, ఇప్పటివరకు పనులు పూర్తి చేయకపోవుటకు గల కారణాలపై జిల్లా కలెక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్ అధికారులను ఆరా తీశారు. ఓడరేవులో జెట్టి నిర్మాణ పనులు పూర్తయినాయని, బ్యాక్ వాటర్ పనులు ప్రారంభించి మూడు మాసములలో పూర్తి చేస్తామని అధికారులు ఆయనకు వివరించారు. పనులు వేగవంతం చేసి పూర్తి చేయాలని ఆయన అధికారులకు సూచించారు. ఆక్వా పార్కు మరియు ఓడరేవు అభివృద్ధి పనులకు సంబంధించి అధికారులతో వాట్సఅప్ గ్రూప్ ఏర్పాటు చేయాలన్నారు. ఆక్వా పార్క్ మరియు ఓడరేవు పనుల పురోగతిపై ప్రతి బుధవారం అధికారులతో సమీక్ష నిర్వహిస్తానని జిల్లా కలెక్టర్ అధికారులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో మత్స్య శాఖ జె డి శ్రీనివాస్ నాయక్, ఉప సంచాలకులు గాలిదేవుడు, రేపల్లె రెవెన్యూ డివిజన్ అధికారి రామలక్ష్మి, నిజాంపట్నం ఇన్చార్జి తహసిల్దార్ శ్రీనివాసరావు, మేరటైన్ బోర్డు డిఈ సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.





## కలాం జయంతి సందర్భంగా కిట్స్ ఎన్ఎస్ఎస్ యూనిట్ ఘన నివాళి

(షణ్ముఖ వెలుగు, మార్కాపురం టౌన్, అక్టోబర్ 15)

భారత మాజీ రాష్ట్రపతి, ప్రముఖ శాస్త్రవేత్త డాక్టర్ ఏపిజె అబ్దుల్ కలాం జయంతిని పురస్కరించుకుని కృష్ణ చైతన్య ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్, ఏవో, వివిధ విభాగాల అధిపతులు, విద్యార్థులు, ఎన్ఎస్ఎస్ స్వయంసేవకులు కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి, ఆయన సేవలను స్మరించుకున్నారు. 'క్షిపణి మనిషి'గా ప్రసిద్ధి చెందిన కలాం యువతకు స్పూర్తిదాయకమైన వ్యక్తిత్వం అని ఎన్ఎస్ఎస్ కార్యక్రమాధికారి పేర్కొన్నారు. ఈ సందర్భంగా కళాశాల వైస్ ప్రిన్సిపాల్ మాట్లాడుతూ డాక్టర్ అబ్దుల్ కలాం తన జీవితం మొత్తాన్ని దేశానికి అంకితం చేశారన్నారు. ఆయన సాదా జీవితం, ఉన్నత ఆశయాలు, యువతకు ఇచ్చిన ప్రేరణ ప్రతి ఒక్కరికి మార్గదర్శకంగా నిలుస్తాయని తెలిపారు. విద్యార్థులు కలాం దారిలో నడుచుకుంటూ దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.






## మాగుంటకు జన్మదిన శుభాకాంక్షలు

(షణ్ముఖ వెలుగు, పొదిలి, అక్టోబర్ 15)

ఒంగోలు పార్లమెంటు సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డి జన్మదిన వేడుకలు ఒంగోలులోని ఆయన నివాసంలో బుధవారం ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో పొదిలి ఏఎంసి ఛైర్మన్ డాక్టర్ సయ్యద్ ఇమాంసా, తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి ఆవులూరి యలమంద, ఏలూరు పిఏసిఎస్ ఛైర్మన్ ఉలవా గోపి, టిఎన్ఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ గౌస్ భాష, నాయకులుతానికొండ వెంకట్రావు, తదితరులు పాల్గొని జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు పూల బొకేలు అందజేసి శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాగుంట కుటుంబం ఎప్పుడూ ప్రజల కోసమే పని చేస్తుందని, ప్రజలకు మరిన్ని సేవలు అందించాలని వారు ఆకాంక్షించారు.

